మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | ఎడిటర్ : నంద కిషోర్ | సంపుటి : 08 | సంచిక : 24 | ఆదివారం | 22 - 06 - 2025 | పేజీలు: 8 | వెల: 4

## టీడీపీవి డైవర్షన్ రాజకీయాలు



3లో..





# యోగా ప్రపంచాన్ని ఏకం చేసింది

- 175 దేశాల్లో యోగా చేయడం సాధారణ విషయం కాదు
- ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది జీవనశైలిని యోగా మార్చింది
- అందరి క్షేమమే నా కర్తవ్యమని భారతీయ సంస్కృతి నేర్పుతుంది
- యోగాంధ్ర 2025లో ప్రధాని మోదీ

మన గళం, విశాఖపట్నం : ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం విశాఖ నగరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో లక్షలాది మంది పాల్గొన్నారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా విచ్చేసి.. యోగాంధ్రలో పాల్గొన్నారు. విశాఖలోని చోళ నుంచి ఆర్కే బీచ్ దగ్గరకు చేరుకున్న మోదీకి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌తోపాటు మంత్రులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "యోగా ప్రపంచాన్ని కలిపింది. 175 దేశాల్లో యోగా చేయడం సాధారణ విషయం కాదు. ఇది మనతోనే సాధ్యమైంది. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది జీవన శైలిని యోగా మార్చింది. నేవీకి చెందిన నౌకల్లో యోగాసనాలు వేస్తున్నారు. యోగా అందరి కోసం. ప్రగతి, ప్రకృతి సంగమస్థలి విశాఖ నగరం. చంద్రబాబు, పవన్, లోకేష్‌కు అభినందనలు. వన్ ఎర్త్.. వన్ హెల్త్ థీమ్‌తో ఈ సారి యోగా డే జరుపుకుంటున్నాం. ప్రపంచం తో మనం అనుసంధానం కావడానికి యోగా ఉపయోగపడుతుంది. అందరి క్షేమమే నా కర్తవ్యమని భారతీయ సంస్కృతి నేర్పుతుంది. ప్రపంచం ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటుంది. ఈ 2 లో..

మేక్ ఇన్ ఇండియా

## చైనాకే మేలు చేస్తోంది

- మేక్ ఇన్ ఇండియా విఫలమైందన్న రాహుల్ గాంధీ
- భారత్ కన్నా చైనాకే ఎక్కువ ప్రయోజనమని ఆరోపణ
- నిరుద్యోగం పెరిగిపోయిందని విమర్శ



మన గళం, న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదని, ఇది పూర్తి గా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ పథకం ద్వారా మన దేశం కంటే చైనానే అధికంగా లాభపడుతోందని ఆయన ఆరోపించారు. దేశీయంగా 2 లో..



సింధు జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించే

## ప్రసక్తే లేదు



మన గళం, న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌పై కఠిన చర్యల్లో భాగంగా సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా నిలిపివేయడం ద్వారా దాయాది దేశానికి ముకుతాడు వేసింది. ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించే అవకాశం ఉందా? దీనిపై కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా శనివారంనాడు ఒక ఇంటర్వ్యూలో స్పష్టత ఇచ్చారు. పాకిస్థాన్‌తో సింధూ జలాల 2లో..

జగన్‌పై చంద్రబాబు

## తీవ్ర ఆగ్రహం



మన గళం, అమరావతి : యోగాంధ్రకు కేంద్రం రూ.75 కోట్లు ఇచ్చిందని స్పష్టీకరణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా, గిన్నిస్ రికార్డు స్థాయిలో చేపట్టిన 'యోగాంధ్ర' కార్యక్రమంపై వైసీపీ అధినేత జగన్ చేసిన విమర్శలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యోగాంధ్ర కార్యక్రమం కోసం ప్రజల డబ్బు వృథా చేస్తున్నారంటూ జగన్ చేసిన ఆరోపణలను చంద్రబాబు తిప్పికొట్టారు. విశాఖలో శనివారం ఆయన ఈ విషయంపై స్పందిం 2లో..

ప్రమాదాలు పూర్తిగా నివారించేందుకు

## చర్యలు తీసుకోండి

రాష్ట్ర అధికారులతో కలిసి చర్యలు తీసుకునేందుకు ఏర్పాట్లు



మన గళం, నెల్లూరు : జిల్లాలోని ఆత్మకూరు సమీపంలో ముంబాయి హైవేపై ఏఎస్ పేట క్రాస్ రోడ్డు వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. చాలా మంది ప్రాణాలు కోల్పోగా.. పలువురు క్షతగాత్రులుగా నిలిచింది. ఆ ప్రాంతాన్ని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఈరోజు (శనివారం) అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కృష్ణపట్నం పోర్టు - ముంబాయి జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని.. అధికారులతో స్వయంగా చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర అధికారులతో కలిసి చర్యలు తీసుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. 2004 జూన్ నాటికి ఏడాది కాలంలో 22 ప్రమాదాలు జరిగాయన్నారు. కూటమి

## ఇరాన్‌పై సైనిక చర్యకు సిద్ధమవుతున్న అమెరికా



ఇజ్రాయెల్‌కు అమెరికా అండగా నిలిస్తే అందరికీ ముప్పు తప్పదని ఇరాన్ హెచ్చరిక

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఘర్షణ వాతావరణం రోజురోజుకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో, ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాఘ్చి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ యుద్ధంలో 2 లో..



విజయవాడ

## ఆస్పత్రికి చెవిరెడ్డి

మన గళం, విజయవాడ : వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయిన ఆయన జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అయితే ఈరోజు (శనివారం) ఉదయం గుండెలో నొప్పిగా ఉందని చెప్పడంతో పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. ముందుగా జైలులో ఉన్న వైద్యులతో పరీక్షలు చేయించారు. ఆపై ముందస్తు జాగ్రత్తగా ఆయనను విజయవాడ ప్రభుత్వ 2లో..




3 రోజులు

## వర్షాలే వర్షాలు

మన గళం, అమరావతి : నైరుతి రుతుపవనాల విస్తరణ, బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నాయి.. ఈ క్రమంలో వాతావరణ శాఖ ఆంధ్రప్రదేశ్‌కు అలెర్ట్ జారీ చేసింది. వచ్చే మూడు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ - యానంలో దిగువ ట్రోపో ఆవరణములో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయి. వీటి ఫలితంగా

## కల్తీ నెయ్యి కేసులో అక్రమాలు బట్టబయలు



మన గళం, తిరుమల : తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంపై సిట్ విచారణలో సంచలన విషయాలు బయటపడ్డాయి. ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషించిన ఉత్తరాఖండ్‌కు చెందిన భోలేబాబా డెయిరీ తిరుపతి నగరంలోని ఓ చిన్న డెయిరీని అడ్డం పెట్టుకుని రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలకు కల్తీ నెయ్యిని పంపినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. విజయవాడ దుర్గమ్మ, శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం, 2లో..

## బాధితురాలికి రక్షణ కల్పించండి



మన గళం, హైదరాబాద్ : పరువు హత్య కేసులో భర్తను కోల్పోయిన 21 ఏళ్ల యువతికి రక్షణ కల్పించాలని హైకోర్టు సరూర్నగర్ పోలీసులను ఆదేశించింది. తన భర్త వడ్లకొండ కృష్ణను ఈ సంవత్సరం జనవరిలో సూర్యాపేటలో హత్యకు గుర య్యాడు. ఈ పరువు హత్య 2లో..

## మేక్ ఇన్ ఇండియా

# చైనాకే మేలు చేస్తోంది

మొదటి పేజీ తరువాయి

తయారీ రంగం కుంటుపడటంతో నిరుద్యోగం కూడా భారీగా పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఢిల్లీలోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ మార్కెట్ అయిన 'నెహ్రూ ప్లేస్'ను రాహుల్ గాంధీ సందర్శించారు. అక్కడ పనిచేస్తున్న ఇద్దరు టెక్నీషియన్లతో ఆయన ముచ్చటించారు. ఈ సంభాషణకు సంబంధించిన వీడియోను తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్న రాహుల్, ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలపై తన అసంతృప్తిని వెళ్లగక్కారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంతో దేశంలో ఫ్యాక్టరీ రంగం ఊహించని విధంగా అభివృద్ధి చెందుతుందని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. మరి అలాంటప్పుడు తయారీ రంగం ఎందుకు రికార్డు స్థాయిలో కనిష్ఠానికి పడిపోయింది? యువతలో నిరుద్యోగిత రేటు ఎందుకు ఇంతగా పెరిగింది? చైనా నుంచి దిగుమతులు రెట్టింపు ఎందుకయ్యాయి?" అంటూ రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ప్రధాని మోదీ కేవలం నినాదాలు ఇవ్వడంలోనే నిష్ణాతులని, సమస్యలకు పరిష్కారాలు చూపడంలో కాదని ఆయన ఎద్దేవా చేశారు. "2014 నుంచి చూస్తే, మన ఆర్థిక వ్యవస్థలో తయారీ రంగం వాటా 14 శాతానికి తగ్గిపోయింది. నిజం చెప్పాలంటే, మనం వస్తువులను ఇక్కడ కేవలం అసెంబ్లింగ్ చేస్తున్నాం, దిగుమతి చేసుకుంటున్నాం తప్పితే, వాటిని పూర్తిస్థాయిలో తయారుచేయడం లేదు. దీనివల్ల, ఆ వస్తువులను తయారుచేస్తున్న చైనా లాభాల పంట పండించుకుంటోంది" అని రాహుల్ విశ్లేషించారు.

## ఇరాన్‌పై సైనిక చర్యకు

# సిద్ధమవుతున్న అమెరికా

అమెరికా, ఇజ్రాయెల్ పక్షాన చేరితే, అది కేవలం ఇరాన్‌కు మాత్రమే కాకుండా ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ ప్రమాదకరంగా పరిణమిస్తుందని ఆయన హెచ్చరించారు. ఇజ్రాయెల్‌పై ఇరాన్, ఇరాన్‌పై ఇజ్రాయెల్ పరస్పర దాడులతో యుద్ధ వాతావరణం నెలకొంది. ఇరాన్‌పై సైనిక చర్యకు అమెరికా కూడా సిద్ధమవుతున్నట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ యుద్ధంలో ఇజ్రాయెల్‌కు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకుంటారని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో అబ్బాస్ అరాఘ్చి స్పందించారు. అమెరికా సైనిక జోక్యం గురించి ఆ దేశ అధ్యక్షుడు ఆలోచించడం దురదృష్టకరమని ఆయన అన్నారు. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధాన్ని నివారించేందుకు దౌత్యపరమైన మార్గాలపై చర్చించేందుకు అరాఘ్చి జెనీవాలో యూరోపియన్ విదేశాంగ మంత్రులతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, త్వరలోనే మరోసారి భేటీ కావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఒకవైపు ఇజ్రాయెల్ దాడులకు అమెరికా రహస్యంగా మద్దతు ఇస్తూ, మరోవైపు అణు ఒప్పంద చర్చలకు తమను ఆహ్వానించడం సరికాదని ఆయన విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికాతో అణు చర్చలు జరపడానికి ఇరాన్ సిద్ధంగా లేదని ఆయన స్పష్టం చేశారు.

# బాధితురాలికి రక్షణ కల్పించండి

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఈ హత్య తర్వాత బాధితురాలుని కూడా అనేకసార్లు చంపుతామని బెదిరింపులు వచ్చాయి. దీనిపై బాధిత యువతి తక్షణ రక్షణ కోరుతూ పోలీసులకు విన్నవించిందని, కానీ అధికారులు స్పందించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు బాధిత మహిళకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. న్యాయమూర్తి జె వినోద్ కుమార్, ఆమె తరఫున దాఖలైన పిటిషన్‌ను పరిశీలించిన తర్వాత, ఆమె ప్రస్తుతం ఉన్న చిరునామాను ధృవీకరించిన అనంతరం ఈ ఆదేశాలు జారీ చేశారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 29న సూర్యాపేట పోలీసులకు రాతపూర్వకంగా అభ్యర్థనను సమర్పించారు. కానీ రెండు నెలలు గడిచినా వారు ఎలాంటి స్పందన ఇవ్వలేకపోయారని ఆమె తన పిటిషన్‌లో పేర్కొంది. పిటిషనర్ న్యాయవాది వాదన ప్రకారం.. తన భర్త హత్య అయిన జనవరి 26 తరువాత నుంచి తాను నిరంతరంగా బెదిరింపులు ఎదుర్కొంటున్నానని పేర్కొంది.

ఇంత తీవ్ర విషయాన్ని పోలీసులు ఎందుకు పట్టించుకోలేదనే అంశంపై న్యాయమూర్తి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సూర్యాపేట పోలీసుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారు. ఇక ఆమె ప్రస్తుతం హైదరాబాదు నగరంలోని దిల్‌సుఖ్‌నగర్‌లో నివసిస్తున్నందున, హైకోర్టు హోం శాఖ ప్రభుత్వ న్యాయవాదికి ఆదేశిస్తూ, సరూర్‌నగర్ పోలీసులను ఆమెకు తక్షణ రక్షణ కల్పించాలని ఆదేశించింది. అంతేకాకుండా పోలీసుల చర్యలపై నివేదికను సమర్పించాలని ఆదేశించింది. ఈ కేసును జూన్ 23న తదుపరి విచారణకు ఉంచింది.

# జగన్‌పై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం



చారు. "కొన్ని సందర్భాల్లో కొందరి గురించి మాట్లాడటం కూడా అనవసరం. రుషికొండ ప్యాలెస్ నిర్మాణం కోసం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన వ్యక్తులు ఇప్పుడు ఇలాంటి విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉంది" అని చంద్రబాబు విమర్శించారు రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసేలా, కలుషితం చేసేలా ఎవరు ప్రయత్నించినా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. "ఇలాంటి భూతాన్ని (ప్రజలను తప్పుదోవ పట్టించే వారిని ఉద్దేశించి) ఎలా నియంత్రించాలో ప్రజలకు వివరించి వారిని చైతన్యపరుస్తాం" అని చంద్రబాబు తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం కూడా తన వంతు సహకారం అందించిందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. "యోగాంధ్ర కార్యక్రమం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.75 కోట్లు కేటాయించింది. ప్రజల శ్రేయస్సు కోసమే ఈ కార్యక్రమం చేపట్టాం" అని చంద్రబాబు వివరించారు. ప్రజల ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో మేలు చేస్తుందని, అలాంటి కార్యక్రమాలపై అనవసర విమర్శలు చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

# సింధు జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదు

మొదటి పేజీ తరువాయి



ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని ఆయన సమాధానమిచ్చారు. ఈ ఒప్పందాన్ని ఏకపక్షంగా తాము రద్దు చేయలేదని, పాకిస్థాన్ పదేపదే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతుండటంతో చట్టపరంగా ఒప్పందాన్ని సస్పెండ్ చేశామని చెప్పారు. 'లేదు, ఎప్పటికీ ఒప్పందాన్ని పునరుద్ధరించం. అంతర్జాతీయ ఒప్పందాలను ఏకపక్షంగా రద్దు చేయకూడదు. అయితే తాత్కాలికంగా నిలిపివేసే హక్కు మాకు ఉంది' అని అమిత్‌షా తెలిపారు. 1960 ఒప్పందంలోని ప్రియాంబుల్‌ను ప్రస్తావిస్తూ, ఇండియా-పాకిస్థాన్ మధ్య శాంతి, ప్రగతికి ఉద్దేశించినట్టు అందులో చెప్పడం జరిగిందని అన్నారు. అయితే దానిని ఉల్లంఘించడం అంటూ జరిగితే ఒప్పందానికి అర్థమే లేకుండా పోతుందని అన్నారు. తమకు హక్కుభుక్తమైన జలాలను తాము సక్రమంగా వినియోగించుకుంటామని, కెనాల్ నిర్మాణం ద్వారా నీటిని రాజస్థాన్‌కు మళ్లిస్తామని చెప్పారు. ఏప్రిల్ 21న జరిగిన పహల్గాం ఉగ్రదాడిపై మాట్లాడుతూ, కశ్మీర్‌లో శాంతి, పర్యాటకాన్ని దెబ్బతీసి, కశ్మీర్ యువకులను తప్పుదారి పట్టించేందుకు ఉద్దేశపూర్వకంగానే ఈ దాడి జరిగిందని చెప్పారు. కశ్మీర్‌తో పాటు యావద్దేశం ఈ ఉగ్రదాడికి వ్యతిరేకంగా సంఘీభావం తెలిపిందన్నారు. పాకిస్థాన్ ఎంచుకున్న మార్గాన్ని ఏమాత్రం జాప్యం చేయకుండా తిప్పికొట్టామని చెప్పారు. జనావాసాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ దాడులు జరపడంతో పాక్ ఎయిర్‌బేస్‌లను ఇండియా ధ్వంసం చేసిందని, కాల్పుల విరమణకు పాక్ కోరడంతో అందుకు అంగీకరించామని చెప్పారు.

# యోగా ప్రపంచాన్ని ఏకం చేసింది

కార్యక్రమంలో భాగంగా సూర్య నమస్కారాలతో గిరిజన విద్యార్థులు రికార్డు సాధించినట్లు ఆయన వెల్లడించారు. యోగా అన్ని క్రీడల్లో భాగం కావాలని ఈ సందర్భంగా సీఎం అభిప్రాయపడ్డారు. స్వర్ణాంధ్ర 2047 సాధనలో యోగాకు భాగస్వామ్యం కల్పిస్తామని చంద్రబాబు నాయుడు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పోస్టల్ స్టాంపులను ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సహా పలువురు నేతలు కలిసి విడుదల చేశారు. ఈ పరిస్థితుల్లో యోగా శాంతికి తోడ్పడుతుంది. యోగా మనలో మానవత్వం పెంచుతుంది. వ్యక్తిగత క్రమశిక్షణకు యోగా ఒక అద్భుత సాధనం. నేను నుంచి మనం అనే భావనకు తీసుకెళ్లే ఆయుధం. ఒబేసిటీ అనేది ప్రపంచానికి పెద్ద సమస్య. తీసుకునే ఆహారంలో నూనె పదార్థాలను 10 శాతం తగ్గించాలి. యోగాను ఒక ఉద్యమంలా తీసుకెళ్లాలి. అందరికి యోగాతో ప్రతి రోజు మొదలవ్వాలి." అని ప్రధాని మోదీ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో పలువురిని ప్రత్యేకంగా పలకరించారు మోదీ.



మొదటి పేజీ తరువాయి

# విజయవాడ ఆస్పత్రికి చెవిరెడ్డి

ఆసుపత్రికి తరలించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజియోథెరపీలో మాజీ ఎమ్మెల్యేకు వైద్య పరీక్షలు నిర్వహించారు డాక్టర్లు. వైద్య పరీక్షలు పూర్తి అయ్యాయి. ఈరోజు సాయంత్రం వరకు వైద్యుల పర్యవేక్షణలోనే మాజీ ఎమ్మెల్యే ఉండనున్నారు. అయితే ప్రాణాపాయం ఏమీ లేదని.. సాయంత్రం వరకు పర్యవేక్షణలో ఉంచి మందులు ఇచ్చి పంపిస్తామని వైద్యులు చెబుతున్నారు. దీంతో ఈరోజు సాయంత్రానికి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అధికారులు జిల్లా జైలుకు తరలించనున్నారు. ఇక ఈ కేసుకు సంబంధించి నిన్న (శుక్రవారం) విజయవాడ ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు పిటిషన్ వేశారు. చెవిరెడ్డిని ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. మరోవైపు అదే సమయంలో చెవిరెడ్డి తరఫు న్యాయవాదులు కూడా బెయిల్ మంజూరు చేయాలంటూ పిటిషన్ వేశారు. అలాగే తనకు జైలు భోజనం పడటం లేదని ఇంటి నుంచి తెచ్చుకునేందుకు అనుమతి ఇవ్వాలని మరో పిటిషన్ దాఖలు చేశారు. వీటికి సంబంధించి సోమవారం (ఈనెల 23) విజయవాడ ఏసీబీ కోర్టులో విచారణకు రానుంది.

# ప్రమాదాలు పూర్తిగా నివారించేందుకు చర్యలు తీసుకోండి

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం వచ్చాక చేపట్టిన చర్యల వల్ల ఈ ఏడాది జూన్ నాటికి 10 ప్రమాదాలు జరిగాయని... ప్రమాదాలని పూర్తిగా నివారించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ఆత్మకూరు సర్కిల్‌లో నాలుగు పోలీస్‌స్టేషన్‌ల కింద 2024లో 68 ప్రమాదాల్లో 37 మంది మృతిచెందారని.. ఈ ఏడాది 27 ప్రమాదాల్లో 16 మంది చనిపోయారని తెలిపారు. ఏపీ వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమం విజయవంతమైందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ నేతృత్వంలో సాధ్యమైందన్నారు.



భవిష్యత్తుతరాలకి ఆరోగ్య ఏపీని అందించే అవకాశం కలిగిందని అన్నారు. ఆదాయం లేని ఆలయాలకు దేవాదాయశాఖ నుంచి నెలకు రూ.10వేలు చొప్పున 5600 ఆలయాలకు ఇస్తున్నామన్నారు. మరిన్ని ఆలయాలను ఈ జాబితాలో చేరుస్తున్నామని... 481 ఆలయాలకు కూడా ఇస్తున్నామని చెప్పారు. అర్చకులకు గతంలో రూ.10 వేలు సంభావనని రూ.15వేలుకు పెంచామన్నారు. ఆలయాల కమిటీలు వేయడానికి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలలోపు ఆదాయం ఉన్న వాటిని గుర్తించామన్నారు. కమిటీలో బ్రాహ్మణులు, నాయుబ్రాహ్మణులు ఉంటారన్నారు. పురాతన ఆలయాల పునర్నిర్మాణాలు జరుగుతున్నాయని అన్నారు. 600 మంది వేద పండితులకు నెలకు రూ.3వేలు చొప్పున ఇస్తున్నామన్నారు.

# 3 రోజులు వర్షాలే వర్షాలు

రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు ఎలా ఉన్నాయో తెలుసుకోండి..

శనివారం ఆదివారం, సోమవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు - బలమైన గాలులు గంటకు 40 -50 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణం ఏర్పడే అవకాశముంది. తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 40 -50 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణం ఏర్పడే అవకాశముంది. తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశముంది. బలమైన గాలులు గంటకు 40 -50 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణం ఏర్పడే అవకాశముంది.

# కల్తీ నెయ్యి కేసులో అక్రమాలు బట్టబయలు

ద్వారకా తిరుమల లాంటి పుణ్యక్షేత్రాలకూ భోలేబాబా సంస్థనే పరోక్షంగా నెయ్యిని సరఫరా చేయించినట్లు నిర్ధారణకు వచ్చారు. తిరుపతిలో డెయిరీకి కమీషన్లు చెల్లించి ఆ కంపెనీ పేరుతోనే కల్తీ నెయ్యిని పంపినట్లు సిట్ అధికారులు విచారణలో తేల్చారు. ఇప్పటివరకు టీటీడీకి మాత్రమే కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని అంతా భావిస్తున్నారు. కానీ ఏ12గా ఉన్న భోలేబాబా డెయిరీ జనరల్ మేనేజర్ హరిమోహన్ రాణా నెల్లూరు ఏసీబీ కోర్టులో మూడోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. దీన్ని ఏపీపీ వ్యతిరేకిస్తూ వినిపించిన వాదనల సందర్భంగా ఈ ఆశ్చర్యకర విషయాలు బయటపడ్డాయి. ఉత్తరాఖండ్‌లోని భోలేబాబా డెయిరీని 2022లో టీడీడీ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన తర్వాత మాల్‌గంగ అనే డెయిరీని తెరపైకి తీసుకొచ్చింది. ఈ కంపెనీకి కమీషన్ చెల్లించి.. సుగంధ ఆయిల్స్, పామోలిన్ సహా పలు రసాయనాలతో తయారుచేసిన కల్తీ నెయ్యిని పరోక్షంగా భోలేబాబా డెయిరీనే టీటీడీకు పంపిందని ఏపీపీ వాదన వినిపించింది. ఈ కల్తీ నెయ్యి వ్యవహారంలో హరిమోహన్ రాణా మాస్టర్‌మైండ్ అని, బయటకు వెళ్తే సాక్ష్యాధారాలు మాయం చేస్తాడని, సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని ఏపీపీ వాదించగా ఏకీభవించిన న్యాయమూర్తి బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించారు.


మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# ఆరోగ్య, సుసంపన్న, ఆనంద ఆంధ్ర ప్రదేశ్ కోసం యోగాంధ్ర

- రాష్ట్రంలో అత్యధికంగా కర్నూలు జిల్లాలో 12.76 లక్షల మంది యోగాంధ్రలో రిజిస్ట్రేషన్
- జిల్లాలో విజయవంతంగా యోగాంధ్ర కార్యక్రమం
- ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా , జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ .

మనగళం, కర్నూలు :ఆరోగ్య, సుసంపన్న, ఆనంద ఆంధ్ర ప్రదేశ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కర్నూలు నగరంలోని ఔట్ డోర్ స్టేడియంలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, జిల్లా అధికారులు,యోగభ్యాసకులు పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా మరియు సంపన్నంగా ఉండాలన్నది ముఖ్యమంత్రి గారి ఉద్దేశం అన్నారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే ముందుగా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించిందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం లో భాగంగా మన రాష్ట్రం ఒక రికార్డును సృష్టించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల 39 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకుంటే అందులో అత్యధికంగా కర్నూలు జిల్లా నుండి 12 లక్షల 76 వేల మందిని రిజిస్ట్రేషన్ చేయగలిగామన్నారు. నెలరోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు, పారిశుద్ధ్య కార్మికులు, ఉద్యోగస్తులు, మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. దాదాపుగా 5 వేల 287 సెంటర్ లలో శిక్షణ కార్యక్రమాలను ఇచ్చామన్నారు.. జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో యోగా కు సంబంధించిన పోటీలు నిర్వహించామని, జిల్లా నుండి రాష్ట్ర స్థాయిలో కూడా పోటీలలో పాల్గొన్నారని, పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. థిమాటిక్ యోగా కార్యక్రమంలో భాగంగా జూన్ 17 వ తేదీ కర్నూల్ అవుట్డోర్ స్టేడియంలో 5 వేల మందితో ఇదే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. అదే విధంగా 3 పర్యాటక ప్రదేశాలలో కూడా 2 వేల 300 మందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరిగిందన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది నుండి జాయింట్ కలెక్టర్ వరకు అందరూ నెల రోజుల పాటు కృషి చేశారని, కలెక్టర్ ఈ సందర్భంగా వారందరికీ అభినందనలు తెలిపారు. అలాగే యోగా మాస్టర్లు కూడా ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా కృషి చేశారని కలెక్టర్ అభినందించారు.. యోగాను ఆపకుండా, ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. యోగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్క పౌరుడు సర్టిఫికెట్ ను తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం లో పాల్గొన్న విద్యార్థులు,మహిళలు, అధికారులు అందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గారితో పాటు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్,విద్యాసంస్థల అధినేత కె.వి.సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కోడుమూరు హై స్కూల్ ప్రాంగణంలో వైభవంగా జరిగిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో స్థానిక హై స్కూల్ ప్రాంగణంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమం ఎంతో వైభవంగా జరిగింది మన దినచర్యలో యోగా అనేది ఎంతో విలువైనదని ఈ యోగాలో పాల్గొనడం వలన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవచ్చు అటువంటి యోగాన్ని ప్రతి ఒక్కరూ దినచర్యలో ఒక భాగంగా ఆచరించాలని ఈ సందర్భంగా యోగ గురువులు తెలియజేశారు అలాగే ఈరోజు ప్రపంచంలోని 175 దేశాలు యోగాను అనుసరించడం జరుగుతుంది మన దినచర్యలో ప్రతిరోజు ఈ యోగా ద్వారా ప్రతి ఒక మనిషి ఆరోగ్యంగా జీవించగలడు, యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వం,మానసిక దృఢత్వం గా వుంటుంది అని, విద్యార్థులలో ఉన్నత స్థితికి యోగాన్ని చేరుస్తుందని అలాగే విద్యాభ్యాసానికి మరియు జ్ఞాపకశక్తికి యోగ ఎంతగా ఉపయోగపడుతుందని యోగ గురువు తెలియజేశారు ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు మరియు పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు

# యోగా దినోత్సవం



మనగళం శ్రీశైలం : దేవస్థానం ఈ రోజు (21.06.2025) అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహించింది. చంద్రవతి కల్యాణ మండపం వద్ద ఈ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ముందుగా సంప్రదాయాన్ని అనుసరించి అర్చకస్వాములు, అధికారులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తరువాత ఒంగోలు నగరానికి చెందిన చిన్నారి రాధారమణి, గణపతి ప్రార్థన, సరస్వతి ప్రార్థన, శివస్తోత్రాలకు సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ విజ్ఞానానికి నిలయమైన మన భారతదేశంలో ఎన్నో వేల సంవత్సరాల నుండి అభివృద్ధి చెందిన పలు శాస్త్రాలలో యోగశాస్త్రం కూడా ఒకటని అన్నారు. వాస్తవానికి యోగా అనేది మన సంస్కృతిలో అనాదిగా ఆచరణలో ఉన్నప్పటికీ పతంజలి మహర్షి దానిని సూత్రబద్ధం చేసి యోగసాధనా మార్గాన్ని సుగమం చేశారన్నారు. రాష్ట్రప్రభుత్వం నెలరోజుల నుండి యోగాంధ్రలో భాగంగా కార్యక్రమాలను నిర్వహించిందన్నారు. శ్రీశైలంలో కూడా గత నెల 31వ తేదీన గంగాధర మండపంవద్ద వద్ద 1500 మందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించబడిందన్నారు. యోగసాధనకు పతంజలి మహర్షి ఎనిమిది అంచలు ఏర్పరచాడని, దానిని అష్టాంగయోగాగా పేర్కొంటున్నామన్నారు. యోగా అంటే కలయిక, కూర్పు, కూడిక, విధానం అనే అర్థాలు ఉన్నాయని చెబుతూ యోగసాధన అనేది ఆత్మ పరమాత్మల అనుసంధానానికి దోహదం చేస్తుందన్నారు. ఇంకా వారు ప్రసంగిస్తూ పతంజలి మహర్షి “యోగ: చిత్తవృత్తి నిరోధ:” అని యోగాను నిర్వచించాడని, ఇక్కడ “చిత్తము” అనేదానికి “మనస్సు” అనే అర్థాన్ని స్వీకరించాలన్నారు. కాబట్టి మనస్సు వలన జరిగే వృత్తులను అంటే మనసు యొక్క విధులను నిగ్రహించగలగడమే యోగా అని పేర్కొన్నారు. యోగా అనేది అటు మనసుతో పాటు ఇటు శరీరానికి కూడా సంబంధించిందన్నారు. కాబట్టి మనిషి తన శరీరాన్ని సాధనంగా చేసుకుని మనస్సును మార్గంగా చేసుకుని చేసే అద్భుతమైన ఆధ్యాత్మికయాత్రగా ఈ యోగాను పేర్కొనవచ్చున్నారు. ఈ ఆధ్యాత్మికగమనములో ఆరోగ్యం, ఆనందం, ఆయువు, ఉపవృత్పత్తులుగా లభిస్తాయన్నారు. అదేవిధంగా చురుకైన జీవనశైలి అలవడుతుందన్నారు. యోగ మనసును కట్టడి చేస్తుందని, మనసుకు శాంతిని, విశ్రాంతిని యోగా ఇవ్వగలుగుతుందన్నారు. అందుకే యోగసాధన వలన బుద్ధి వికసిస్తుందన్నారు.




యోగాసనాలు :కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖ యోగా శిక్షకులు, యోగాచార్య, గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం, ఒంగోలు వారు ఆయా అంశాలను వివరిస్తూ అందరిచేత యోగాసనాలు చేయించారు. ప్రతి ఆసనానికి కూడా వీరు వివరణ ఇస్తూ, యోగాపరమైన అంశాలను అధునిక వైద్య విజ్ఞానంతో అనుసంధానం చేస్తూ ఆయా విశేషాలను, యోగా వల్ల కలిగే ప్రయోజనాలను పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారీరక ఆసనాలు, శ్వాసపై ధ్యాస, ధ్యానం, ప్రాణాయామం, ముద్రలు మొదలైనవన్నీ యోగాలోని ప్రధాన క్రియలు అని చెప్పారు. ఆరోగ్యకరమైన జీవితం, సుఖసంతోషాలు, బాధల నుండి విముక్తి, మానసిక ప్రశాంతత మొదలైనవన్నీ కూడా యోగసాధన ద్వారా పొందవచ్చునని అన్నారు. యోగావలన శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా ఎన్నో మంచిఫలితాలు లభిస్తాయన్నారు. కార్యక్రమములో వీరు తాడాసనము, వృక్షాసనము, పాదహస్తానము, అర్ధచక్రాసనం, త్రికోణాసనం, భద్రాసనం, వజ్రాసనం, అర్ధ ఉత్తాసనం, ఉత్తాసనం మొదలైన ఆసనాలను వేయించారు. ఆసనాల తరువాత సూక్ష్మవ్యాయమం చేయించబడింది. సూక్ష్మవ్యాయమం తరువాత ప్రాణాయామం చేయించబడింది. కపాలభాతి, అనులోమ విలోమ, శీతలి, భ్రామరి మొదలైన విధానాలతో ప్రాణాయామం కొనసాగింది. ప్రాణాయామం తరువాత ధ్యానం చేయించబడింది. చివరగా శాంతిమంత్రాలతో ఈ యోగా కార్యక్రమం ముగించబడింది. అదేవిధంగా యోగా శిక్షకులందరికీ దేవస్థానం తరుపున శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి, వారిని సత్కరించడం జరిగింది. ఈ యోగా కార్యక్రమములో యోగాచార్య బాలసుబ్రహ్మణ్యంతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఆగమపాఠశాల విద్యార్థులు, శివసేవలకులు పాల్గొన్నారు. చివరగా వేదాశీర్వచముతో యోగాచార్యులకు శేషవస్త్రం, స్వామిఅమ్మవార్ల ప్రసాదములను అందజేయబడ్డాయి.



## రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు సీఎం కృషి చేస్తున్నారు

- ఎంపీ బస్తిపాటి నాగరాజు



మనగళం, కర్నూలు :ఆంధ్రప్రదేశ్ ని ఆరోగ్యాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు బాబు కృషి చేస్తున్నారని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఎంపీ యోగాసనాలు చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు యోగ పై అవగాహన కలిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు యోగ కార్యక్రమాలు చెప్పటిందన్నారు. యోగ ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలాన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానాలకు యోగ మంచి సాధనమని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు కృష్ణ యాదవ్, రఫీక్, సచివాలయం ఉద్యోగులు , పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టీడీపీవి డైవర్షన్ రాజకీయాలు



మనగళం, కర్నూలు :వైఎస్ఆర్ పార్టీ కర్నూలు జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అధ్యక్షతన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పథకాలను అమలు చేయలేక డైవర్షన్ పొలిటిక్స్ చేస్తున్నారని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని భూస్తా పీతం చేస్తాం' అని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఏడు సార్లు తెలుగుదేశం ఎమ్మెల్యేగా గెలిచిన బుచ్చయ్య చౌదరి 'జగనన్న తల నరుకుతామంటూ' మాట్లాడారు. వైఎస్ జగన్ పల్నాడు పర్యటనలో ఓ కార్యకర్త సినిమాలోని డైలాగుతో పోస్టర్ ను ప్రదర్శించాడని, అదే అంశాన్ని జగనన్న మీడియా సమావేశంలో చెప్పాడన్నారు. దీన్ని వక్రీకరించి ఒక పథకం ప్రకారం ఆయనపై కుట్ర చేసే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీకి చెందిన కార్యకర్త తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి గురించి మాట్లాడుతూ రెడ్ల తలనరుకుతామని బహిరంగంగా చెబుతుంటే డిప్యూటీ సీఎం హెూదాలో ఖండించాల్సింది పోయి నవ్వడం సిగ్గుచేటని విమర్శించారు. తెలుగుదేశం, జన సేన నాయకులు సంస్కారహీనంగా మాట్లాడుతుంటే వాటిని ఖండించాల్సిన ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంలు నవ్వుకుంటున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇది బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ పేరిట టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సంతకంతో ఆ పార్టీ జారీ చేసిన ష్యూరిటీ బాండ్. ఇందులో పథకాలను 2024 జూన్ నుంచే అమలు చేస్తామని కూడా ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ బాండ్ పేపర్లతో ఇంటింటికీ వెళ్లిన టీడీపీ క్యాడర్ ఆ ఇంటిలో మొత్తం ఎందరు ఉన్నారు. మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు ఎంతమంది ఉన్నారు? అనే వివరాలు, వారి పేర్లు తీసుకుని, వీరికి ఏ పథకం కింద ఎంతెంత వస్తుందో అని లెక్కలేసి మరీ చెప్పారు. బాండ్ పేపర్లను మొబైల్ ఫోన్లకూ పంపారు. వీటిని నమ్మి ప్రజలు ఓట్లేయడంతో టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైంది. కానీ, సూపర్ సిక్స్ సహా వారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏవీ అమలు కాలేదు. దీంతో ప్రతి ఇంట ఆగ్రహం వ్యక్తమవుతోంది. టీడీపీ కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులను ఎక్కడికక్కడ నిలదీసేందుకు సిద్ధమవుతున్నారు.ఈ కార్యక్రమం లొ పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నకల్ సురేందర్ రెడ్డి, వైస్సార్సీపీ పార్టీ అనుబంధ జిల్లా, నగర అధ్యక్షులు, వైస్సార్సీపీ కార్యకర్తలు మరియు ఎస్వి యూత్ పాల్గొన్నారు.

## సాంస్కృతిక కార్యక్రమాలు

మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈరోజు (20.06.2025) లీక్షితాశ్రీ నృత్యకళాశాల, నందికొట్కూరు వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో ప్రణవాకారం, శంకరశ్రీగిరి, కామాక్షిస్తుతి, శివతాండవం, తదితర గీతాలకు సహస్ర, శ్రావణజ్యోతి, సాహితీ, జాహ్నవి తదితరులు నృత్య ప్రదర్శనను చేయడం జరుగుతోంది. రెండవ కార్యక్రమములో భాగంగా పూజిత నృత్యాలయ, పెందుర్తి, విశాఖపట్నం వారిచే వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో వినాయకకౌత్వం, శివుడుతాండవమాడే, శివలీలలు, భో... శంభో శివశంభో తదితర గీతాలకు సి.హెచ్. పూజిత, లీలాకృష్ణ, చాతుర్య, దీక్షిత, హర్షిత తదితరులు నృత్య ప్రదర్శన చేయనున్నారు. ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీ స్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా నిర్వహించబడుతున్నాయి. నిత్యకళారాధన కార్యక్రమాలు



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

మాటల మాంత్రికుడు పాత్రో

తెలుగు చిత్ర సీమ లో చెరగని సంతకం గణేష్ పాత్రో. సినిమాలను బట్టి, పాత్రలకు సమయోచితంగా, సందర్భాను సారంగా మాటలు రాయడంలో ఆయనకు ఆయనే సాటి. దర్శకుడి ఆలోచనలను అర్థం చేసుకుని, అందుకు అను గుణంగా సంభాషణలు రాయడం అన్నది మామూలు విషయం కాదు. అంత సులువు కానే కాదు. దర్శకుని మనోభావాలు ప్రతిబింబించేలా రచయిత సంభాషణలు రాస్తేనే సదరు సినిమా ప్రేక్షకుల ఆదరాన్ని చూర గొంటున్నదన్న మాట యదార్థం. కొందరు దర్శకులకు, కొందరు రచయితలతో కలిసి పనిచేయడం చాలా అనుకూలంగా ఉంటుంది. బహుశా, ఈ కారణంగానే చాలామంది రచయితలకు ఎక్కువ మంది దర్శకులతో పనిచేసే అవకాశం దొరకదు. కానీ, గణేష్ పాత్రోకు తన సినీ రంగ కలిసి చేసిన ప్రయాణంలో దర్శకులందరూ వైవిధ్యాన్ని కోరుకునే వారే. వెండితెర మీద తమదైన ముద్ర వేదుకున్న వారే. బాల చందర్ తో పాటు, సింగీతం శ్రీనివాసరావు, క్రాంతికుమార్ వంశీ, కోడి రామకృష్ణ, ఇంకా నేటితరం దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల ఎవరి శైలి వాళ్ళది. తెలుగు వెండితెరపై ఎవరి ప్రత్యేకత వారిది. వారు కోరుకున్న విధంగా, వారి అభిరుచులకు అనుగుణంగా సంభాషణలు రాసి మెప్పించిన ఘనత మాత్రం గణేష్ పాత్రోదే. గణేష్ పాత్రో కథలు, నాటికలు సమకాలీన పరిస్థితులకి, మధ్య తరగతి కుటుంబాలలోని మనుషుల అంతరంగాలు, సంఘర్షణలకు ప్రతి బింబాలుగా నిలుస్తాయి. అందుకే దర్శకులు నిర్మాతలు ఆయన రచనలు ఇష్ట పడ్డారు. ప్రేక్షకులు ఆదరించారు.గణేష్ పాత్రో పేరు చెప్పగానే వెంటనే గుర్తుకు వచ్చే మరో పేరు కె. బాలచందర్. పందొమ్మిది వందల డెబ్భై, ఎనభై దశకాల్లో తెలుగు తెరమీద బాలచందర్, పాత్రో కాంబినేషన్ విజయాల పరంపర కొనసాగించు కుంది. బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన ప్రతి చిత్రానికి తెలుగులో గణేష్‌పాత్రోనే సంభాషణలు రాశారు. బాల చందర్ తమిళ ఆలోచనలకు అచ్చ తెలుగు మాటలను అద్దిన రచయిత గణేష్ పాత్రో. అందుకే కాబోలు బాలు, స్వప్న, జానీ, సుహాసిని, బుచ్చిబాబు, విద్య, బేబీ.. ఈ పాత్రలేవీ కూడా పరభాషా దర్శకుడు సృష్టించినవన్న భావన కలగదు. సినిమాకు స్థానికత అద్దడంలో సంభాషణలది కీలక పాత్ర. బాలచందర్ దర్శకత్వం వహించిన మరో చరిత్ర, గుప్పెడు మనసు, ఆకలి రాజ్యం, రుద్ర వీణ, ఇది కథకాదు లాంటి పలు చిత్రాలు గణేష్ పాత్రోకు మంచి పేరు తెచ్చి పెట్టాయి. దర్శకుడు కే.బాల చందర్‌తో గణేష్‌పాత్రో అనుబంధం విడదీయ రానిది. అందుకేనేమో బాలచందర్ మరణించిన రెండు వారాలకు గణేష్ పాత్రో ఆయనను అనుసరించి వెళ్లడం గమనార్హం. సీనియర్ దర్శకుడు కోడి రామకృష్ణ, గణేష్ పాత్రోల కలయికలో 40 చిత్రాలు తెరకెక్కడం విశేషం. ముఖ్యంగా భార్గవ ఆర్ట్స్ పిక్చర్స్ అధినేత దివంగత ఎస్ గోపాల్ రెడ్డికి ఆస్థాన రచయితగా గణేష్ పాత్రో వ్యవహరించారు. అలాగే, ప్రముఖ దర్శకుడు క్రాంతికుమార్‌తో కలసి పలు చిత్రాలకు పనిచేశారు.గణేష్‌పాత్రో స్వాతి చిత్రానికి 1983లో, రుద్రవీణ చిత్రానికి గాను 1988లో ఉత్తమ నంది అవార్డులను అందుకున్నారు. మయూరి చిత్రానికి గాను ఉత్తమ స్క్రీన్ ప్లే రచయితగా నంది అవార్డును దక్కించు కున్నారు. 2009లో ఆయన అభిమానంగా ప్రేమించే అక్కినేని నాగేశ్వరరావు పురస్కారాన్ని, 2013లో మనసు కవి ఆత్రేయ బిరుదును అందుకున్నారు. గణేష్ పాత్రో విజయ నగరం జిల్లా పార్వతీ పురంలో 1945 జూన్ 22న ఆది లక్ష్మీనారాయణ పాత్రో, సూర్యకాంతం దంపతులకు జన్మించారు. గణేష్ పాత్రో తండ్రి, పార్వతీపురం దగ్గర ఒక చిన్న గ్రామానికి కరణంగా పనిచేసేవారు. గణేష్ ప్రాథమిక విద్య అక్కడే సాగింది. పార్వతీ పురంలో ఉన్నత చదువులు చదువుతూ, నాటకాలలో నటించడం ప్రారంభించారు. పాఠశాల పుస్తకాలతో పాటు సాహిత్యాన్ని కూడా చదవటం ప్రారంభించారు. పీ.యూ.సి పూర్తయిన తర్వాత పై చదువులకు ఆంధ్ర విశ్వ విద్యాలయంలో చేరారు. అక్కడ విశ్వ విద్యాలయ సాంస్కృతిక సంఘానికి జాయింట్ సెక్రటరీగా నాటకాలు వ్రాయటం, వాటిని రంగస్థలంపై ప్రదర్శించడం ప్రారంభించారు. చిన్నప్పటి నుంచే నాటకాలు రాయడం, నటనపై గణేశ్ పాత్రో ఆసక్తి పెంచుకున్నారు. 'పావలా', 'కొడుకు పుట్టాల', 'ఆలోచించండి' వంటి పలు నాటకాలతో రచయితగా ప్రాచుర్యం పొందారు. ఇందులో 'కొడుకు పుట్టాల' నాటకానికి అంతర్జాతీయ పురస్కారం లభిం చింది. ఈ నాటకం పలు భాషల్లో అనువాదం కావడంతో పాటు ఆకాశవాణి, దూరదర్శన్ లలో ప్రసారమై, పాత్రో కు గుర్తింపు తెచ్చాయి. 1970 ప్రాంతంలో రచన ప్రారంభించిన గణేష్ పాత్రో అయిదేళ్ళ కాలంలో ప్రథమ శ్రేణి నాటక కర్తగా పేరు తెచ్చుకున్నారు. రచనలు చాలా తక్కువే అయినా, వ్రాసిన ప్రతి నాటిక, నాటకము రంగస్థలం మీద రక్తి కట్టి రసజ్ఞుల మెప్పు పొందింది. కథా వస్తువును పరి గ్రహించడంలో, కథనంలో, పాత్ర చిత్రణలో, సన్నివేశాల మేళవింపులో, మాటల కూర్పులో నిత్య నూతన పరిమళాన్ని వెదజల్లిన ప్రతిభాశాలి గణేష్ పాత్రో. సంఘటనల ద్వారా సమస్యను శక్తివంతంగా ఆవిష్కరించటం అయన రచనా విధానంలో ప్రత్యేకత. మృత్యుం జయుడు, తెరచి రాజు, తరంగాలు, అసుర సంధ్య నాటకాలూ, కొడుకు పుట్టాల, పావలా, లాభం, త్రివేణి, ఆగండి! కొంచెం ఆలోచించండి మొదలైన నాటికలు తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని దోచుకున్న ఉత్తమ రచనలు. 1970 నుండి 1990ల వరకు అనేక సినిమాలకు సంభాషణలు, కథను సమ కూర్చారు. 125కు పైగా చిత్రాలకు కథలు, మాటలను అందించారు. పదిహేనేళ్ళ విరామానంతరం సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాకు సంభాషణలు సమకూర్చారు. "హలో గురూ ప్రేమ కోసమేరా ఈ జీవితం"... నిర్ణయం సినిమాలో పాట రాశారు. అదే ఆయన సంభాషణలు రాసిన చివరి చిత్రం. ఆయన సినీ సంభాషణలు సమకూర్చిన చిత్రాల్లో సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, నిర్ణయం, సీతారామయ్య గారి మనవరాలు, రుద్రవీణ, తలంబ్రాలు, ప్రేమించు పెళ్ళాడు, మయూరి, మనిషికో చరిత్ర, గుప్పెడు మనసు, ఇది కథ కాదు, మాపల్లెలో గోపాలుడు ఇలా పలు హిట్ చిత్రాలు ఉన్నాయి.

## ఘనంగా నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవం



మన గళండోన్ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలి సందర్భంగా డోన్ పట్టణ మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో గౌరవనీయులు డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ"ఈరోజు మనం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నాం.ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం జూన్ 21న ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. 2015లో భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారు చేసిన ప్రతిపాదన మేరకు,ఐక్యరాజ్యసమితి ఈ దినాన్ని అధికారికంగా అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది. యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు. ఇది మన శరీరానికి ఆరోగ్యం, మనసుకు శాంతిని, ఆత్మకు శక్తిని అందిస్తుంది. ఇప్పటి జీవనశైలిలో పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. అలాంటి సమయంలో యోగా మనకు విశ్రాంతిని, అంతర్గత శాంతిని అందిస్తుంది. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కనీసం పది నిమిషాలు యోగా చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ఈ సంవత్సరం యోగాంధ్ర 2025 పేరిట విశాఖపట్నంలో జరుగుతున్న చారిత్రాత్మక కార్యక్రమం అంతర్జాతీయంగా విశేష గుర్తింపు పొందుతోంది. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మరియు ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి సమక్షంలో, సుమారు నాలుగు లక్షల మందితో నిర్వహించబడుతున్న ఈ కార్యక్రమం, ప్రపంచంలోనే అతిపెద్ద యోగా ఈవెంట్‌గా గుర్తింపు పొందబోతోంది. ఇప్పటికే రెండు కోట్ల మందికి పైగా నమోదు చేసుకోవడం గర్వకారణం.ఈ ఘనత గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించనుంది. భారతదేశం నెమ్మదిగా యోగాంధ్రగా, అంటే యోగా సామ్రాజ్యంగా మారుతోంది. మన జీవితాల్లో యోగా ఒక భాగమవ్వాలి. ఇది శరీరానికి ఆరోగ్యం, మనస్సుకు ప్రశాంతత, ఆత్మకు బలం కలిగించగలదు. అందుకే ఈ యోగా దినోత్సవం సందర్భంలో మనమందరం యోగాన్ని అనుసరించేందుకు ముందడుగు వేయాలి అని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు.

## కోడుమూరు నియోజకవర్గం లో టిడిపి విస్తృతస్థాయి సమావేశం





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండల కేంద్రంలో టిడిపి విస్తృత స్థాయి సమావేశం శనివారం స్నేహ వినాయక వినాయక కళ్యాణ మండపంలో కోడుమూరు పట్టణ టిడిపి అధ్యక్షులు గంగాధర్ నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గంగాధర్ నాయుడు మాట్లాడుతూ కోడుమూరు మండల స్థాయి విస్తృత స్థాయి సమావేశం కేడిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి నాయకత్వంలో, నారా చంద్రబాబు నాయుడు ఆశయాలను ప్రభుత్వంలో జరిగే సంక్షేమ పథకాలపై ప్రజలకు ఎలా చేరవేయాలి అనే ఉద్దేశంపై సమీక్షలు ఏర్పాటు చేసుకొని , నాయకత్వాన్ని నిలబెట్టుకొని టిడిపిని బలోపేతం చేసి ముందుకు తీసుకుని పోవడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి కోడుమూరు మండల అబ్జర్వర్ సుబ్బారాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామ సమస్యలను తెలుసుకొని ఆ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని వారి సందర్భంగా తెలియజేశారు అలాగే పార్టీ బలోపేతానికి కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు కోడుమూరు మండల టిడిపి నాయకుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మండలంలోని టిడిపి నాయకులందరూ కలిసి కట్టుగా ఇప్పటినుంచి సైనికులుగా తెలుగుదేశం పార్టీ కొరకు కష్టపడుతామని వివరించారు. ఈ కార్యక్రమంలో కే ఈ మల్లికార్జున గౌడ్, ఎల్లప్ప నాయుడు, బ్రిటిష్ రాముడు, బాలకృష్ణ, మధు రవి బలరాం, రవీంద్ర గౌడ్ స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఇవ్వాల్సింది యోగాంధ్ర కాదు ఉద్యోగాంధ్ర విద్యాంధ్రప్రదేశ్ ఆకలి రహిత ఆంధ్ర ప్రదేశ్ ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో ఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి రంగస్వామి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు యోగాంధ్ర కాదు విద్యా ఆంధ్రప్రదేశ్ కావాలని గిన్నిస్ రికార్డు కోసం ఎన్డీఏ ప్రభుత్వం గిరిజన విద్యార్థులను విశాఖపట్నం తరలించడానికి ఖండించారు వారికి ఏర్పాట్లు చేయడంలో ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందారని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తన గొప్పల కోసం, మోడీ మెప్పు కోసం, మరీ ముఖ్యంగా గిన్నిస్ రికార్డు కోసం వేల మంది గిరిజన విద్యార్థులను ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. అనేక మంది గిరిజన విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల నుండి, ప్రభుత్వ గిరిజన సంక్షేమ హాస్టల్స్ నుండి యోగాంధ్ర కార్యక్రమానికి అర్ధరాత్రి 2:00 గంటలకు బస్సులో తరలించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో విద్యార్థులకు నిద్రించడానికి సరైన సదుపాయాలు కూడా ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే రీతిలో రాష్ట్రంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు పిల్లలను తరలిస్తారా అని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు అనేక సంవత్సరాలుగా గిరిజన విద్యార్థులు సంక్షేమ హాస్టల్స్ లో పౌష్టికాహారం అందక ఇబ్బంది పడుతున్నారని, ముందుగా కూటమి ప్రభుత్వం గిరిజన విద్యార్థులని రక్తహీనత నుండి దూరం చేయమని అన్నారు. గిరిజన విద్యార్థులకు జ్వరం, వాంతులతో బాధపడితే హాస్పిటల్స్ కు తరలించడానికి హెల్త్ వర్కర్లు, అంబులెన్స్ లు ఉండవు కానీ యోగా ఆంధ్రకు మాత్రం ప్రత్యేకమైన బస్సులు ఏర్పాటు చేశారని అన్నారు. నిజంగా ప్రభుత్వానికి గిరిజన విద్యార్థుల మీద చిత్తశుద్ధి ఉంటే ఆ ప్రాంతాల్లో స్పోర్ట్స్ స్కూల్స్ ప్రారంభించాలని డిమాండ్ చేసారు. యోగాంధ్రా కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ వేల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో హాజరవ్వడం పై హర్షం వ్యక్తం చేశారని అన్నారు. ముందు గిరిజన విద్యార్థులకు పౌష్టికాహారం అందించి, హెల్త్ వర్కర్లను ఏర్పాటు చేసిన రోజున గొప్పలు చెప్పుకోండి అని సూచించారు. ముందు పాఠశాలలో కళాశాలలో మంచి ఫుడ్ స్టోర్స్ విద్యాసంస్థల్లో పెట్టండి అప్పుడు యోగా లాంటి ఒలంపిక్స్ లో ఇండియాకు గోల్డ్ మెడల్స్ ఇస్తారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు పాల్పడితే ఏఐఎస్ఎఫ్ గా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు

## కేడీసీ ఆధ్వర్యంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శనివారము కోడుమూరు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో యూత్ రిక్రియేషన్ క్లబ్ నందు అంతర్జాతీయ 8వ దినోత్సవాన్ని జరుపుకోవడం జరిగినది. ఇందులో యోగ్యాస్యకుడిగా వెంకటేష్, కొన్ని యోగాసనాలు సభ్యులచే చేయించారు. ఇందులో కే డి సి ప్రెసిడెంట్ డాక్టర్ షాకీర్, జనరల్ సెక్రెటరీ బి జయన్న,వైస్ ప్రెసిడెంట్ ఎస్ జయరాం సలహాదారులు హనుమంతప్ప బలరాం, హుస్సేన్ అప్ప స్వామి,ఇబ్రహీంసాహెబ్, హర్ష, అస్లాం భాష, లీగల్ అడ్వైజర్ పవన్ కుమార్ రెడ్డి, టోనీపే ఈరన్న మొదలైన వారు పాల్గొన్నారు.

## యోగ ఒక జీవనశైలి..ఉగ్ర సేనా రెడ్డి .





మన గళం అవుకు : యోగ అనేది మానవుల జీవనశైలి అని తెలుగుదేశం పార్టీ అవుకు మండల అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డి శనివారం అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు అవుకు మండలంలోని రామపురం గ్రామంలో సాయిబాబా దేవాలయం నందు ఉగ్రసేనారెడ్డి యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రసేనారెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోని 175 దేశాలు యోగాను అనుసరించడం జరుగుతుంది . ఈ యోగా ద్వారా ప్రతి ఒక మనిషి ఆరోగ్యంగా జీవించగలడు, యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వం,మానసిక దృఢత్వం గా వుంటుంది అని, విద్యార్థులలో ఉన్నత స్థితికి యోగాన్ని చేరుస్తుందని ఆయన అన్నారు.అలాగే పట్టణంలోని మదర్ మోడల్ హై స్కూల్ నందు ముచ్చలపూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులు యోగ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కోడుమూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ఆకేపోగు రాంబాబును పరామర్శించిన కెడీసీసీబీ చైర్మన్ శ్రీ డి విష్ణువర్ధన్ రెడ్డి



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ఆకేపోగు రాంబాబు అనారోగ్యంతో కర్నూల్ లొని ఆద్య హాస్పిటల్ లొ చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని కెడీసీసీబీ చైర్మన్ శ్రీ డి విష్ణువర్ధన్ రెడ్డి హాస్పిటల్ కి వెళ్లి ఆకే పోగు రాంబాబును పరామర్శించి అక్కడ డాక్టర్లతో మాట్లాడి సరైన వైద్యం అందించవలసిందిగా డాక్టర్లకు చెప్పడం జరిగింది అలాగే అక్కడే ఉన్న వాళ్ళ కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా రంగస్వామిని ఉండమని తెలియజేశారు అలాగే ఆకే పోగు రాంబాబు కుటుంబానికి అండగా ఉంటామని కుటుంబానికి భరోసా ఇచ్చారు అలాగే కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మరియు నేను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రాంబాబు కుటుంబానికి ప్రభుత్వం నుండి ఏదైనా సాయం చేయు విధంగా కృషి చేస్తామని వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు

## దానిమ్మ ఆకులను ఇలా తీసుకుంటే చాలు..



మన గళం : దానిమ్మ ఆరోగ్యానికి చాలా మంచిది.. అలాంటి దానిమ్మ మాత్రమే కాదు ఆకులు కూడా చాలా మంచివని నిపుణులు చెబుతున్నారు.. దానిమ్మ గింజలలో ఎన్నో పోషకాలు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.. ఈ ఆకులను ఎలా తీసుకుంటే మంచి ఫలితాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం. దానిమ్మ ఆకులలో కూడా చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఈ ప్రయోజనాల గురించి మనలో చాలా మందికి తెలియదు.. ఈ ఆకులను తీసుకోవడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.. ఆకులను, దానిమ్మ బెరడును ఉపయోగిస్తున్నారు. చలికాలంలో జలుబు, దగ్గు సమస్య ఎక్కువగా వేధిస్తూ ఉంటుంది.. ఐదు లేదా ఆరు ఆకులను తీసుకొని నీటితో శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి.. ఒక గిన్నె తీసుకొని ఒక గ్లాస్ నీళ్లు పోసుకొని ఆకులు వేసి బాగా మరిగించి పక్కన పెట్టుకోవాలి.. ఆ నీటిని వడగట్టి ఉదయం, సాయంత్రం తీసుకుంటే దగ్గు, జలుబు నుండి ఉపశమనం కలుగుతుంది.. నిద్రలేమి సమస్యలతో బాధపడేవారు రాత్రి పడుకోవటానికి అరగంట ముందు దానిమ్మ ఆకుల కాషాయం తాగితే ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా నిద్ర పడుతుంది. అంతేకాకుండా అధిక బరువు సమస్య, చెడు కొలెస్ట్రాల్ తొలగిపోతుంది.. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. చర్మ సమస్యలు తగ్గిపోతాయి.. అలాగే నోటి సమస్యలు కూడా మయం అవుతాయి.. మలబద్దకం, గ్యాస్ సమస్యలు కూడా తగ్గిపోతాయి.. దానిమ్మ పండ్లు కూడా ఆరోగ్యానికి మంచిదే..

## లవంగాలను ఇలా తీసుకుంటే ఆ సమస్యలన్నీ మాయం..

మన గళం : మన వంట గది ఒక వైద్యశాల అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.. ప్రతి వస్తువుతో ఎన్నో రోగాలను నయం చెయ్యవచ్చు అని నిపుణులు చెబుతున్నారు. ఇందులో పవర్ ఫుల్ యాంటీ ఆక్సిడెంట్స్, యూజీనాల్ ఉంటాయి. ఇది ఓ రకమైన యాంటీ ఆక్సిడెంట్, ఇది శరీరాన్ని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడేందుకు హెల్ప్ చేస్తుంది. లవంగాల వల్ల కలిగే ఉపయోగాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం.. అధిక బరువు తో బాధపడేవారికి ఇవి బెస్ట్ చాయిస్.. బరువు తగ్గడానికి బాగా హెల్ప్ చేస్తుంది. అలాగే క్యాన్సర్, మధుమేహం, పంటి నొప్పి, కడుపుపూతల వంటి సమస్యలు దూరమవుతాయి.. నోటి సమస్యలను దూరం చేస్తుంది..యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు, యాంటీ ఆక్సిడెంట్స్, మన రక్తాన్ని క్లీన్, హెల్దీగా చేయడంలో హెల్ప్ చేస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. అంతేకాదు .. లవంగాల్లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పెప్టిక్ అల్సర్ వల్ల వచ్చే మంటను తగ్గించేందుకు సహాయపడుతుంది. క్యాన్సర్స్‌తో పోరాడడంలో హెల్ప్ చేస్తాయి. లవంగాల్లోని ఎల్లాజిక్ యాసిడ్ సమ్మేళనాలు క్యాన్సర్ అభివృద్ధిని నిరోధించడంలో సాయపడతాయి.. యూజినాల్, యాంటీ ఆక్సిడెంట్, డైటరీ ఫైబర్, విటమిన్స్ ఉన్నాయి. ఇవి జీవక్రియని పెంచి, కేలరీలను వేగంగా బర్న్ చేస్తాయి.. దాంతో త్వరగా బరువు తగ్గుతారు.. ఇంకా ఎన్నో సమస్యలను దూరం చేస్తుంది..



## రోజూ దోసకాయ తినడం మంచిది

కీరదోస కాయను తీసుకోవడం వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో అందరికీ తెలిసే ఉంటుంది.. వేడి కారణంగా చాలా మంది హెల్త్ ప్రాబ్లమ్స్‌ని ఫేస్ చేస్తున్నారు. అదే విధంగా, తగినంత పోషకాలు అందించాలి. రోజూ దోసకాయ తినడం మంచిది. ఇందులో పోషకాలు అనేక లాభాలను అందిస్తాయి.. సమ్మర్ లో కీరాను తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటో తెలుసుకుందాం.. శరీరాన్ని లోపల్నుంచి కూడా చల్లబరచడం చాలా ముఖ్యం. హాట్ సీజన్ స్నాక్‌గా దోసకాయని తీసుకోవాలి. దోసకాయని తీసుకుంటే వేడిని తగ్గించాలి.. వడదెబ్బతో పాటు గుండె జబ్బులు రాకుండా ఉంటాయి.. వేసవిలో ఈ కాయలు మనకు బాగా ఉపయోగపడతాయి.. ముఖ్యంగా డిహైడ్రేషన్ కు గురవ్వకుండా కాపాడుతుంది. వీటిలో 95 శాతం నీళ్లు ఉంటాయి.. ఇక శరీరానికి కావలసిన అన్ని పోషకాలు ఇందులో ఉంటాయి.. అంతేకాదు వీటిలో పొటాషియం, మెగ్నీషియం, సోడియం లోపం ఉన్నవారు కచ్చితంగా వారి ఆహారంలో దోసకాయని యాడ్ చేసుకోవాలి.. ఇంకా చెప్పాలంటే వేడిని తట్టుకొనేలా, ఎప్పుడు శరీరాన్ని హైడ్రెడ్ గా ఉండేలా చేస్తుంది.. ట్యాన్ రిమూవల్ గా కూడా పనిచేస్తుంది.. చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయ పడుతుంది

## మొలకలతో ఉన్న ఆరోగ్య ప్రయోజనాలు...

మన గళం :సాధారణంగా ఎవరైనా ఆరోగ్యంగా, అందంగా ఉండాలని కోరుకుంటారు. అయితే అనుకున్నంత మాత్రం అందరికీ ఇది సాధ్యపడదు. దీని కోసం చేయాల్సిన పనులతో పాటు తినాల్సిన ఆహార పదార్థాలు కూడా ఉంటాయి. అయితే ఆరోగ్యం మరియు అందం రెండూ కావాలంటే ఏం చేయాలి? ఏం తినాలి? అనుకుంటున్నారా? అయితే ఇది చూసేయండి. హెల్త్ బావుండాలంటే తప్పనిసరిగా వ్యాయామం చేయాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎవరికైనా శారీరక శ్రమ లేకపోతే ఆరోగ్యంగా ఉండటం కొంచెం కష్టమేనట. అలాగే తినే పదార్థాల్లో కూడా మంచి పోషకాలు ఉండే వాటిని తీసుకోవాలని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే మొలకలు తినడం వలన అందం, ఆరోగ్యం రెండూ సాధ్యమేనని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. మొలకలను ప్రతి రోజూ ఉదయం లేక సాయంత్రం సమయంలో తీసుకోవడం మంచిదని నిపుణులు తెలియజేస్తున్నారు. మన శరీరానికి కావాల్సిన ఎన్నో పోషకాలు ఈ మొలకల్లో ఉన్నాయట. బాడీకి కావాల్సిన వివిధ రకాల విటమిన్లు, మెగ్నీషియం, రాగి, ఐరన్ మరియు పొటాషియం వంటి మినరల్స్ కూడా సమృద్ధిగా ఉంటాయి. బరువు తగ్గడంలో మొలకలు కీలక పాత్ర పోషిస్తాయి. వీటిలో ఉండే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి.



అదేవిధంగా రక్త ప్రవాహంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ స్థాయిని కూడా తగ్గిస్తుంది. కంటి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు మెదడు పనితీరు మెరుగ్గా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. మొలకలను తినడం వలన ఎర్ర రక్తకణాల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని తెలుస్తోంది. అదేవిధంగా మొలకలను తినడం వలన శరీరానికి కావాల్సిన విటమిన్ -సి తో పాటు ఇనుము, జింక్ వంటి పోషకాలు అందుతాయి

## మామిడికాయ ఆ వ్యాధికి దివ్యౌషధం..!

మన గళం :వేసవిలో పండిన మామిడిపండు చాలా రుచిగా ఉంటుంది. కానీ పచ్చి మామిడిలో అనేక ఔషధ గుణాలు కూడా ఉన్నాయి. అందుకే వేసవిలో మామిడి పండ్లను తినడానికి ఇష్టపడతారు.పచ్చి మామిడిలో ఎన్నో పోషకాలు ఉంటాయి. ఇది మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. పచ్చి మామిడిలో విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, కాల్షియం, ఫాస్ఫరస్, ఐరన్, జింక్, ఫైబర్, కాపర్, పొటాషియం, సోడియం వంటి పోషకాలు ఉన్నాయని గత సంవత్సరాలుగా వ్యవసాయ విజ్ఞాన కేంద్రం నియామత్‌పూర్‌లో పని చేస్తున్న హోమ్ సైన్స్ నిపుణుడు డాక్టర్ విద్యా గుప్తా తెలిపారు. పచ్చి మామిడి వల్ల అనేక రకాల వ్యాధులను దూరం చేస్తుందని ఆయన అన్నారు. ఉదర వ్యాధులకు పచ్చి మామిడి దివ్యౌషధం: డాక్టర్ విద్యా గుప్తా మాట్లాడుతూ పచ్చి మామిడిలో ఉండే విటమిన్ సి వల్ల శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. దీని వల్ల మన శరీరాన్ని అనేక రకాల అంటు వ్యాధుల నుండి దూరంగా ఉంచుతుంది. అంతే కాదు, పచ్చి మామిడి కడుపుకు కూడా చాలా మేలు చేస్తుంది. ఇది మలబద్ధకం సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఇది జీర్ణవ్యవస్థను కూడా బలపరుస్తుంది. పచ్చి మామిడి కడుపులో ఎసిడిటీ సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది.పచ్చి మామిడి కంటికి మేలు చేస్తుంది : పచ్చి మామిడిపండు తింటే ఎముకలు దృఢంగా ఉంటాయని డాక్టర్ విద్యా



గుప్తా తెలిపారు. నిజానికి ఇందులో కాల్షియం పుష్కలంగా లభిస్తుంది. ఎముకలు ఆరోగ్యంగా మరియు దృఢంగా ఉండటానికి ఇది చాలా అవసరం. దీని రెగ్యులర్ వినియోగం ఎముక సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. పచ్చి మామిడి ఎండాకాలం నుండి వడదెబ్బ నుండి రక్షిస్తుంది అని డాక్టర్ విద్యా గుప్తా తెలిపారు . పచ్చి మామిడి పన్నాను వినియోగిస్తే, హీట్ స్ట్రోక్ నుండి రక్షించడంలో ఇది చాలా ప్రభావవంతంగా ఉంటుంది. మీరు పచ్చి మామిడికాయ పచ్చడిని కూడా తినవచ్చు.

## లక్షాధికారిని చేసే పోస్టాఫీసు స్కీమ్..!



మన గళం : ప్రతి నెలా కొంత డబ్బు ఆదా చేయడం ద్వారా భవిష్యత్తు కోసం పెద్ద నిధిని సృష్టించాలనుకునే వారికి పోస్ట్ ఆఫీస్ రికరింగ్ డిపాజిట్ పథకం ఒక వరం. ఈ పథకం అతిపెద్ద లక్షణం ఏమిటంటే దీనిలో ఎటువంటి రిస్క్ ఉండదు. నేటి ద్రవ్యోల్బణ యుగంలో ప్రతి ఒక్కరూ కష్టపడి సంపాదించిన డబ్బును సరైన మార్గంలో పెట్టుబడి పెట్టాలని, భారీ లాభాలను సంపాదించాలని కోరుకుంటారు. మీరు కూడా తక్కువ రిస్క్‌తో పెద్ద నిధిని సృష్టించాలని కలలు కంటుంటే, పోస్ట్ ఆఫీస్ గొప్ప పథకం మీ కోసం. అదే పోస్ట్ ఆఫీస్ రికరింగ్ డిపాజిట్. ఈ పథకంలో మీ డబ్బు పూర్తిగా సురక్షితం. అదే సమయంలో మీరు గొప్ప రాబడిని పొందుతారు. ప్రతి నెలా చిన్న మొత్తాలను డిపాజిట్ చేయడం ద్వారా లక్షల నిధిని ఎలా సృష్టించవచ్చో తెలుసుకుందాం. చిన్న పొదుపులు, పెద్ద రాబడి : ప్రతి నెలా కొంత డబ్బు ఆదా చేయడం ద్వారా భవిష్యత్తు కోసం పెద్ద నిధిని సృష్టించాలనుకునే వారికి పోస్ట్ ఆఫీస్ రికరింగ్ డిపాజిట్ పథకం ఒక వరం. ఈ పథకం అతిపెద్ద లక్షణం ఏమిటంటే దీనిలో ఎటువంటి రిస్క్ ఉండదు. మీరు జమ చేసిన డబ్బు భారత ప్రభుత్వ సావరిన్ గ్యారెంటీ కింద పూర్తిగా సురక్షితం. బ్యాంకుల్లో డిపాజిట్ మొత్తంపై రూ. 5 లక్షల వరకు మాత్రమే హామీ ఉండగా, పోస్ట్ ఆఫీస్‌లో మీ మొత్తం డిపాజిట్ మొత్తం సురక్షితం. ఈ పథకంలో మీరు ప్రతి నెలా ఒక చిన్న మొత్తాన్ని డిపాజిట్ చేయవచ్చు. కనీస పెట్టుబడి నెలకు కేవలం రూ. 100. అలాగే మంచి విషయం ఏమిటంటే గరిష్ట పెట్టుబడిపై ఎటువంటి పరిమితి లేదు. అంటే, మీరు మీకు కావలసినంత పెట్టుబడి పెట్టవచ్చు. ఈ పథకం మెచ్యూరిటీ కాలం 5 సంవత్సరాలు. కానీ మీరు దానిని 5-5 సంవత్సరాలు పొడిగించవచ్చు. పోస్ట్ ఆఫీస్ ఆర్‌డీ పథకంలో మీకు 6.8% వడ్డీ రేటు లభిస్తుంది. ఇది త్రైమాసిక ప్రాతిపదికన కాంపౌండ్ వడ్డీ రూపంలో జోడిస్తారు. అంటే, మీరు మీ డబ్బుపై వడ్డీని మాత్రమే కాకుండా, వడ్డీపై వడ్డీని కూడా పొందుతారు. దీని కారణంగా, మీ డబ్బు వేగంగా పెరుగుతుంది. ఈ పథకంలో మీరు ఒకే ఖాతా లేదా ఉమ్మడి ఖాతా రెండింటినీ తెరవవచ్చు. రూ. 5000 డిపాజిట్ చేస్తే రూ. 8 లక్షలకు పైగా.. మీరు ప్రతి నెలా రూ. 5000 డిపాజిట్ చేస్తే, 5 సంవత్సరాల మెచ్యూరిటీ కాలంలో మీరు మొత్తం రూ. 3 లక్షలు డిపాజిట్ చేస్తారు.

## బుల్లెట్ ప్రూఫ్ కారు కొనాలంటే ఎవరి అనుమతులు కావాలి...?

మన గళం :ఇప్పుడు వాహనాన్ని బుల్లెట్ ప్రూఫ్ చేయడానికి ఎలాంటి అనుమతులు అవసరమో తెలుసుకుందాం. మీరు బుల్లెట్ ప్రూఫ్ వాహనం కొనుగోలు చేయాలంటే ముందుగా మీరు జిల్లా మేజిస్ట్రేట్, ఎస్పీ పోలీస్, హోం మంత్రిత్వ శాఖ నుండి అనుమతి తీసుకోవాలి. మీరు లగ్జరీ లేదా పెద్ద వాహనాన్ని బుల్లెట్ ప్రూఫ్ తయారీకి సెలబ్రిటీ అయినా, రాజకీయ నాయకుడైనా ప్రతిరోజూ చాలా మందికి హత్య బెదిరింపులు వస్తున్నాయి. అటువంటి పరిస్థితిలో ఈ వ్యక్తులు తమ భద్రత కోసం బుల్లెట్ ప్రూఫ్ కార్లను ఉపయోగిస్తారు. రాజకీయ నాయకులు, నటులు, చాలా మంది బుల్లెట్ ప్రూఫ్ కార్లలో ప్రయాణిస్తుంటారు. ఈ బుల్లెట్ ప్రూఫ్ కార్లు ఎలా తయారు చేస్తారు అనే ప్రశ్న మీ మనసులో ఎప్పుడైనా వచ్చిందా..? దీనితో పాటు, ఒక పెద్ద ప్రశ్న ఏమిటంటే, ఒక వ్యక్తి తన కారును బుల్లెట్ ప్రూఫ్ కారు కొనాలంటే ఎంత ఖర్చు అవుతుంది. బుల్లెట్ ప్రూఫ్ గా తయారు చేసిన తర్వాత మీ కారు ఎంత బలంగా ఉంటుందంటే, ఎలాంటి వారు అయినా ఏమి చేయలేరు. కారు హ్యాండ్ గ్రెనేడ్ల నుండి ఏకే-47 వరకు దాడులను తట్టుకోగలదు. ఏదైనా సాధారణ కారును బుల్లెట్ ప్రూఫ్ గా మార్చడానికి కారు అసలు నిర్మాణం మారిపోతుంది. కారును బలంగా తయారు చేయడంతో పాటు, విండో గ్లాస్, ఇంటీరియర్ వైరింగ్ కూడా మారుస్తారు.



## పాలసీదారుడు, నామినీ మరణిస్తే బీమా సొమ్ము వస్తుందా...?

మన గళం :రోడ్డు ప్రమాదాలు, విషాదాలు కుటుంబాలు ఒకేసారి ఎక్కువ మంది సభ్యులను కోల్పోయే పరిస్థితికి దారితీస్తాయి. అలాంటి సందర్భాలలో బీమా డబ్బును ఎలా క్లెయిమ్ చేయవచ్చు. మొదటి హక్కు ఎవరికి లభిస్తుంది? అనే అనుమానం అందరికీ ఉంటుంది. భారత బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) ప్రకారం పాలసీదారుడు, నామినీ ఒకే ప్రమాదంలో మరణిస్తే బీమా కంపెనీ పాలసీదారుడి తర్వాత నామినీ మరణించినట్లు భావించాల్సి ఉంటుంది. ఈ సందర్భంలో నామినీకు సంబంధించిన చట్టపరమైన వారసులు క్లెయిమ్‌కు అర్హులుగా పరిగణిస్తారు. బీమా సంస్థ నిబంధనలు, నిర్దిష్ట పాలసీని బట్టి తుది నిర్ణయాలు మారవచ్చు. అయితే ఈ సూత్రం సాధారణంగా వర్తిస్తుంది. చట్టపరమైన వారసులు వీరే : హిందూ వారసత్వ చట్టం ప్రకారం (పురుష పాలసీదారునికి) ప్రాధాన్యతకు చట్టపరమైన క్రమం ప్రకారం భార్య, కుమారులు, కుమార్తెలు, తల్లి. కొడుకు లేదా కుమార్తె మరణిస్తే పాలసీదారుడి మనవరాళ్ళు బీమా డబ్బును క్లెయిమ్ చేసుకోవచ్చు. పైన పేర్కొన్న వారసులు లేకుంటే, 'క్లాస్ 2 వారసులు' పరిగణిస్తారు. వీరిలో తండ్రి, సోదరులు, సోదరీమణులు, మేనల్లుళ్లు, మేనకోడళ్ళు, తాతామామలు, ఇతరులు ఉన్నారు. పాలసీదారునికి క్లాస్ 1 లేదా క్లాస్ 2 లో వారసులు లేకుంటే తండ్రి లేదా తల్లి వైపు నుండి బంధువులు వంటి విస్తృత కుటుంబం ఆ మొత్తాన్ని క్లెయిమ్ చేయవచ్చు. చట్టపరమైన వారసుడు కనుగొనకపోతే బీమా మొత్తం ప్రభుత్వానికి బదిలీ చేస్తారు.




## మారన్ సోదరుల ఇంటి పోరు...

మన గళం :మారన్ సోదరుల మధ్య వివాదం.. సన్ టీవీ షేర్ల పతనానికి కారణమైంది. ఇవాళ ఆ ఛానల్ షేర్లు 4 శాతం డౌన్ అయ్యాయి. డీఎంకే ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి దయానిధి మారన్.. తన సోదరుడు కళానిధి మారన్‌కు లీగల్ నోటీసులు పంపారు. సన్ టీవీ నెట్వర్క్ చైర్మెన్‌గా కళానిధి మారన్ వ్యవహరిస్తున్నారు. 2003లో జరిగిన షేర్ల లావాదేవీలపై అంశంపై కళానిధి మారన్‌తో పాటు ఆయన భార్య కావేరి కళానిధికి దయానిధి మారన్ లీగల్ నోటీసులు ఇచ్చారు. సన్ టీవీ టేకోవర్ సమయంలో తప్పుడు విధానాలు, తప్పుడు పాలనతో అక్రమాలకు పాల్పడినట్లు కళానిధి మారన్‌పై దయానిధి మారన్ విమర్శలు చేశారు. కోఆర్డినేటెడ్ పద్ధతిలో ఆర్థిక నేరాలకు తన సోదరుడు పాల్పడినట్లు దయానిధి మారన్ తన అఫిడవిట్‌లో తెలిపాడు. చీటింగ్, మనీ ల్యాండరింగ్‌కు కూడా పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసు ఆ కేసులో దర్యాప్తు చేపట్టనున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. తండ్రి మురసోలీ మారన్ 2003లో మృతిచెందారు. అయితే ఆ తర్వాత జరిగిన సన్ టీవీ షేర్లు అప్పగింతలో వివాదం నెలకొన్నట్లు తెలుస్తోంది. వీలునామా రాయకుండానే తండ్రి చనిపోయారని, అందుకే 2003 నాటి ప్రకారం షేర్ల పంపకం జరగాలన్నారు. సెబీ, ఆర్బీఐ, ఎస్ఎఫ్ఐఓ, ఈడీ, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీలు ఈ విచారణలో పాల్గొనాలని కళానిధికి నోటీసులో తెలిపారు. కంపెనీలో కళానిధి మారన్‌కు 75 శాతం వాటా ఉన్నది. అది మార్కెట్ విలువ 25 వేల కోట్లు. సన్ టీవీ నెట్వర్క్ లో తమిళం, తెలుగు, హిందీ, బెంగాలీ భాషలు ఉన్నాయి. ఎఫ్ఎం రేడియో స్టేషన్లు ఉన్నాయి. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఉంది.

## పిల్లల భవిష్యత్‌కు ఇన్సూరెన్స్ ముఖ్యం...పెరుగుతున్న ఆదరణ...

మన గళం : భారతీయ దిగ్గజ ప్రైవేట్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ బజాజ్ అలయంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఓ కీలక సర్వే నిర్వహించింది. పిక్సిస్ గ్లోబల్, క్వాల్స్.ఏఐ భాగస్వామ్యంతో చేపట్టిన 'బజాజ్ అలయంజ్ లైఫ్ ఉమెన్ టర్మ్ సర్వే' ఆసక్తికర అంశాలను వెలుగులోకి తెచ్చింది. దేశంలోని మెట్రో, ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాల నుండి వెయ్యి మందికి పైగా ఉద్యోగినులు, స్వయం ఉపాధి పొందుతున్న మహిళలు ఈ సర్వేలో పాలుపంచుకున్నారు. ఆర్థిక ప్రాధాన్యతలలో మార్పులు : మహిళల ఆర్థిక ప్రాధాన్యతలలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నట్లు సర్వే స్పష్టం చేసింది. పిల్లల భవిష్యత్తు, వారి విద్యా వ్యయాలు, ఆరోగ్యం ముఖ్యమైన అంశాలుగా మారాయి. పిల్లల భవిష్యత్తు రక్షణకు ఆర్థిక సాధనాలలో టర్మ్ ఇన్సూరెన్స్‌కు మహిళలు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆరోగ్య సంబంధిత రిస్కులపై వారిలో అవగాహన పెరిగినట్లు ఇది సూచిస్తుంది. వైద్యపరమైన అనూహ్య ఖర్చుల వల్ల తమ కుటుంబ పొదుపు తీవ్రంగా దెబ్బతింటుందని 53 శాతం మంది మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. క్రిటికల్ ఇల్‌నెస్ కవరేజీకి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని 87 శాతం మంది పేర్కొన్నారు. తమ టర్మ్ ప్లాన్‌లో అంతర్గతంగా హెల్త్ మేనేజ్‌మెంట్ సేవలు తప్పనిసరిగా ఉండాలని 50 శాతం మంది తెలిపారు. పిల్లల చదువు ప్రయోజనాలు టర్మ్ ప్లాన్‌లో భాగంగా ఉండాలని మహిళలు ఆకాంక్షిస్తున్నారు. ఆర్థికంగా స్వతంత్రంగా ఉన్న మహిళలు, బీమాను కేవలం జీవిత రక్షణకు మాత్రమే పరిమితం చేయకుండా, దీర్ఘకాలిక ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి ఉపయోగపడే సాధనంగా పరిగణిస్తున్న విషయాన్ని ఈ సర్వే ధృవీకరిస్తుంది.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# ఊటీలో మోహన్ లాల్ విలాసవంతమైన గెస్ట్ హౌస్...



మన గళం :ప్రముఖ మలయాళ నటుడు మోహన్ లాల్‌కు ఊటీలోని లవ్‌డేల్ అనే ప్రశాంతమైన ప్రాంతంలో 'హైడ్ అవే' పేరుతో ఒక విలాసవంతమైన విడిది గృహం ఉంది. దశాబ్దం క్రితం కుటుంబ సభ్యులతో గడిపేందుకు నిర్మించుకున్న ఈ ఇంటిని ఇప్పుడు సాధారణ ప్రజలు కూడా అద్దెకు తీసుకునే సౌకర్యం కల్పించారు. ఆరు నుంచి తొమ్మిది మంది వరకు సౌకర్యవంతంగా బస చేసేందుకు వీలుగా ఇందులో మూడు బెడ్‌రూమ్‌లు ఉన్నాయి. నగర జీవితపు రణగణ ధ్వనులకు దూరంగా, ప్రకృతి సౌందర్యం నడుమ సేదతీరాలనుకునే వారికి ఇది చక్కని ఎంపిక. ఈ ఇంటిని లక్స్ అన్‌లాక్ అనే వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. ఇక్కడ బస చేసేవారు, 25 ఏళ్లుగా మోహన్ లాల్ కుటుంబానికి సేవలందిస్తున్న ప్రత్యేక చెఫ్ తయారుచేసిన రుచికరమైన కేరళ వంటకాలను ఆస్వాదించవచ్చు. అలాగే, మోహన్ లాల్ సినీ ప్రస్థానానికి సంబంధించిన జ్ఞాపకాలు, కార్టూన్లు ఇంటి అలంకరణలో భాగంగా ఉన్నాయి. ఆహ్లాదకరమైన తోట, ఫైర్‌ప్లేస్ ఉన్న ఫ్యామిలీ రూమ్, 'మరక్కార్', 'బారోజ్' వంటి చిత్రాలలో ఉపయోగించిన నమూనా తుపాకులతో కూడిన 'గన్ హౌస్' కూడా ఈ ఇంటిలో ప్రత్యేక ఆకర్షణలుగా నిలుస్తాయి.

# చిరంజీవితో స్పెషల్ సాంగ్‌లో స్టెప్పులేసేది ఈ అమ్మడే..



మన గళం మెగాస్టార్ చిరంజీవి ఇప్పటికీ కుర్ర హీరోలకు పోటీ ఇస్తూ సినిమాలు చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. వాల్తేరు వీరయ్య లాంటి హిట్ తర్వాత చిరంజీవి నటించిన బోళాశంకర్ సినిమా డిజాస్టర్ గా నిలిచింది. మెహర్ రమేష్ దర్శకత్వంలో భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. మెగాస్టార్ చిరంజీవి.. జెట్ స్పీడ్ లో సినిమాలు చేస్తున్నారు. బోళాశంకర్ లాంటి ఫ్లాప్ సినిమా తర్వాత చిరంజీవి ఇప్పుడు విశ్వంభర సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. సోసియో–ఫాంటసీ కాన్సెప్ట్ తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు దర్శకుడు వశిష్ట. . యూవి క్రియేషన్స్ బ్యానర్‌పై వి. వంశీ కృష్ణ రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్ రెడ్డి నిర్మిస్తున్నారు. చిరంజీవి, ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తారని అంచనా. ఈ సినిమాలో ఆయన సరికొత్త అవతారంలో దర్శనమిస్తారని, హనుమాన్ భక్తుడిగా ఉండే పాత్రలో నటిస్తున్నారని టాక్. ఇక ఈ సినిమాలో త్రిష కృష్ణన్, అషికా రంగనాథ్, రమ్య పసుపులేటి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాతో పాటు అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు చిరంజీవి.సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భారీ హిట్ అందుకున్న అనిల్ రావిపూడి ఇప్పుడు చిరంజీవితో సినిమా చేస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఈ సినిమా ఇప్పటికే సెకండ్ షెడ్యూల్ కూడా పూర్తి చేసుకుంది. అలాగే ఈ సినిమాలో నయనతార హీరోయిన్ గా నటిస్తుంది. ఈ సినిమాలో చిరంజీవి వింటేజ్ లుక్ లో కనిపించనున్నారు. అదేవిధంగా ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయనున్నారు. ఇదిలా ఉంటే విశ్వంభర సినిమాలో భీమ్స్ ఓ స్పెషల్ సాంగ్ కు కంపోజ్ చేయనున్నారని ఇప్పటికే టాక్ వినిపిస్తుంది. సినిమాకు కీరవాణి మ్యూజిక్ అందిస్తున్నారు. ఒక్క స్పెషల్ సాంగ్ కు మాత్రం భీమ్స్ మ్యూజిక్ అందిస్తున్నారని తెలుస్తుంది. ఇక ఈ స్పెషల్ సాంగ్ కోసం కన్నడ బ్యూటీని రంగంలోకి దింపుతున్నారని తెలుస్తుంది. ఆమె ఎవరో కాదు అందాల భామ నిశ్వికా నాయుడు. ప్రభుదేవాతో కలిసి 'హితలకా కరిబయడా మావ' అంటూ సోషల్ మీడియాను ఊపేసింది. ఈ సాంగ్ తో ఈ అమ్మడు విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఇప్పుడు మెగాస్టార్ కోసం ఆమెను రంగంలోకి దింపుతున్నారని తెలుస్తుంది. త్వరలోనే దీని పై పూర్తి క్లారిటీ రానుంది.

# నా శరీరం... నా ఇష్టం : శృతిహాసన్



మన గళం టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమలలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి శృతిహాసన్, తన వ్యక్తిగత విషయాలపై ఎప్పుడూ ముక్కుసూటిగా వ్యవహరిస్తారు. ముఖ్యంగా కాస్మెటిక్ సర్జరీల విషయంలో తన అభిప్రాయాలను నిర్భయంగా పంచుకుంటారు. తాజాగా మరోసారి తన ముక్కుకు చేయించుకున్న ప్లాస్టిక్ సర్జరీ గురించి, ఆ నిర్ణయం వెనుక గల కారణాలను శృతిహాసన్ సూటిగా వివరించారు. "టీనేజ్‌లో ఉన్నప్పుడు నా ముక్కు నాకు నచ్చేది కాదు, అందుకే ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నాను. అంతేకాదు, ముఖం మరింత ఆకర్షణీయంగా కనిపించడానికి ఫిల్లర్స్ కూడా వాడాను" అని ఆమె తెలిపారు. "ఈ విషయాలు దాచాల్సిన అవసరం నాకు కనిపించలేదు. చాలా సందర్భాల్లో ఈ విషయాన్ని చెప్పాను. కొందరు ఇలాంటివి బయటకు చెప్పడానికి ఇష్టపడరు, అది వారి వ్యక్తిగత అభిప్రాయం. దాన్ని నేను గౌరవిస్తాను. అలాగే, నా విషయాలను ధైర్యంగా చెప్పుకునే స్వేచ్ఛ నాకు ఉంది. అది తప్పు కాదని నేను నమ్ముతున్నాను" అని శృతి వివరించారు. భవిష్యత్తులో అవసరమైతే ఫేస్‌లిఫ్ట్ కూడా చేయించుకునే అవకాశం ఉందని ఆమె అన్నారు. "ఇది పూర్తిగా నా నిర్ణయం. ఇతరులకు ఇబ్బంది కలగనంత వరకు, నా శరీరం గురించి నేను తీసుకునే నిర్ణయాలను ఎవరూ ప్రశ్నించాల్సిన అవసరం లేదు" అని శృతి హాసన్ స్పష్టం చేశారు. కాగా, శృతి ప్రస్తుతం సూపర్ స్టార్ రజనీకాంత్‌తో కలిసి 'కూలీ' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## వేలకోట్లు నష్టపోయిన నిర్మాతలు



మన గళం ప్రస్తుతం పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద చిన్న సినిమాలు సత్తా చాటుతున్నాయి. స్టార్ హీరోహీరోయిన్స్ లేకుండా తక్కువ బడ్జెట్ తో రూపొందించిన చిత్రాలు భారీ విజయాన్ని అందుకుంటున్నాయి. కానీ ఓ సినిమా మాత్రం భారీ అంచనాల మధ్య విడుదలై థియేటర్లలో అట్టర్ ఫ్లాప్ అయ్యింది. పెట్టిన పెట్టుబడికి ఏమాత్రం సంబంధం లేకుండా వసూళ్లు రాబట్టింది. ముఖ్యంగా నిర్మాతలకు పెద్ద షాకిచ్చింది. ప్రతి శుక్రవారం థియటర్స్ లో కొత్త కొత్త సినిమాలు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. ఒక వైపు ఓటీటీల్లో సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటుంటే.. థియటర్స్‌లో కొత్త కొత్త సినిమాలు విడుదలై ఆడియన్స్ ను అలరిస్తున్నాయి. ప్రస్తుతం పాన్ ఇండియా లెవల్ లో సినిమాలు తెరకెక్కుతున్నాయి. ఇక ఇప్పుడు పాన్ ఇండియా లెవల్ సినిమాలు తెరకెక్కుతున్నాయి. చిన్న సినిమాలు పెద్ద సినిమాలు అని తేడా లేకుండా వరుసగా సినిమాలు ప్రేక్షకులను అలరించడానికి రెడీ అవుతున్నాయి. ఇక భారీ బడ్జెట్స్ తో తెరకెక్కిన సినిమాలు ఈ మధ్య థియేటర్స్ లో భారీ డిజాస్టర్ అవుతున్నాయి. విడుదలకు ముందు భారీ అంచనాలు క్రియేట్ చేసిన సినిమాలు చాలా థియేటర్స్ కు వచ్చిన తర్వాత దారుణంగా నిరాశపరిచాయి. అలాంటి సినిమాల్లో ఈ సినిమా ఒకటి. సినీ ఇండస్ట్రీలోనే బిగెస్ట్ డిజాస్టర్ సినిమా ఇది.. ఈ సినిమా వల్ల ఏకంగా రూ. 1,393 కోట్లు నష్టపోయారు నిర్మాతలు. వలర్డ్ సినిమా హిస్టరీలో ఇంత పెద్ద మొత్తంలో నష్టపోయిన సినిమా మరొకటి లేదట.. ఇంతకూ ఆ సినిమా ఎదో తెలుసా.? ఆ సినిమా ఎదో కాదు జాన్ కార్టర్.. ఆండ్రూ స్టాంటన్ దర్శకత్వం వహించిన ఒక అమెరికన్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ చిత్రం ఇది. విడుదలకి ముందు భారీ అంచనాలు నెలకొన్న ఈ సినిమా థియేటర్స్ లో డిజాస్టర్ అయ్యింది. ఈ చిత్రం బాక్స్ ఆఫీస్ వద్ద విజయవంతం కాలేదు.. దీని కారణంగా డిస్నీకి ఆర్థిక నష్టాలు వచ్చాయి. ఈ సినిమా ఏకంగా 250 మిలియన్ డాలర్లుతో తెరకెక్కించారు. అంటే మన ఇండియన్ రూపీస్ లో రూ. 2,171 కోట్లకు పైగా.. ఇంత భారీ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా భారీ డిజాస్టర్ అయ్యింది. అలాగే ఈ సినిమాలో విజువల్స్ మాత్రం పేక్షకులను ఆకట్టుకున్నాయి. కానీ సినిమా మాత్రం నిరాశపరిచింది. సినిమా డిజాస్టర్ అవ్వడానికి మెయిన్ గా మార్కెటింగ్ మైనస్. సినిమాను జనాల్లోకి తీసుకెళ్లడంలో మేకర్స్ ఘోరంగా ఫెయిలయ్యారు. అందుకే సినిమా డిజాస్టర్ అయ్యింది.

# అక్కినేని అభిమానుల్లో టెన్షన్.. టెన్షన్



మన గళం ౹మార్పు మంచికే అంటారు కదా..? ఇప్పుడు నాగార్జున ఇదే చేసి చూపిస్తున్నారు. ఆ నలుగురు ఎప్పుడు మారతారు..? ఇంకెన్నాళ్లు హీరోయిన్లతో డ్యూయెట్లు పాడతారు..? పక్క ఇండస్ట్రీ హీరోలను చూసి కూడా నేర్చుకోరా..? ఇలా మన దగ్గర చాలా కామెంట్స్ వినిపించేవి. ఇప్పుడు మార్పు మొదలైంది.. మన్మథుడితోనే ఆ మార్పు మొదలైంది. మరి ఆయనేం చేస్తున్నారు..? నాగార్జున పూర్తిగా మారిపోయినట్లేనా..? ఇకపై హీరోగా కనిపించడా..? ఇప్పుడు అక్కినేని అభిమానుల్లో ఇలాంటి అనుమానాలే వస్తున్నాయి. అయితే అలాంటిదేం లేదని తేల్చేసారు నాగ్. త్వరలోనే ఈయన 100వ సినిమా స్టార్ట్ కానుంది. దీనికి దర్శకుడు కూడా ఖరారయ్యారు. ముందు నుంచి వినిపించిన తమిళ దర్శకుడు కార్తిక్ పేరునే కన్ఫర్మ్ చేసారు ఈ సీనియర్ హీరో. 100వ సినిమాను త్వరలోనే మొదలు పెడతానంటూ నాగ్ చెప్పడంతో గాల్లో తేలిపోతున్నారు అక్కినేని అభిమానులు. దీనికి దర్శకుడు కూడా ఖరారయ్యారు. ముందు నుంచి వినిపించిన తమిళ దర్శకుడు కార్తిక్ పేరునే కన్ఫర్మ్ చేసారు ఈ సీనియర్ హీరో. 100వ సినిమాను త్వరలోనే మొదలు పెడతానంటూ నాగ్ చెప్పడంతో గాల్లో తేలిపోతున్నారు అక్కినేని అభిమానులు. హీరోగానే కాకుండా.. క్యారెక్టర్ ఆర్టిస్టుగానూ బిజీగానే ఉన్నారీయన. అంతేకాదు కథ నచ్చితే విలన్‌గా కూడా నటించడానికి ఓకే అనేస్తున్నారు నాగ్. ఫ్యాన్స్‌కు కాస్త కష్టంగా ఉన్నా.. నెగిటివ్ రోల్స్ వైపు అడుగులేస్తున్నారు నాగార్జున. ఈ మార్పు మంచికే అంటున్నారాయన. హీరోగానే కాకుండా.. క్యారెక్టర్ ఆర్టిస్టుగానూ బిజీగానే ఉన్నారీయన. అంతేకాదు కథ నచ్చితే విలన్‌గా కూడా నటించడానికి ఓకే అనేస్తున్నారు నాగ్. ఫ్యాన్స్‌కు కాస్త కష్టంగా ఉన్నా.. నెగిటివ్ రోల్స్ వైపు అడుగులేస్తున్నారు నాగార్జున. ఈ మార్పు మంచికే అంటున్నారాయన. కూలీ సినిమాలో నాగార్జున చేస్తున్నది నెగిటివ్ క్యారెక్టరే.. అది ఆయనే చెప్పారు కూడా. మరోవైపు కుబేరాలో గ్రే షేడ్స్ ఉన్న పాత్రలోనే కనిపించారు నాగ్. త్వరలోనే బ్రహ్మాస్త్ర 2తో పాటు మరో రెండు సినిమాలు చేయనున్నారు. కూలీ సినిమాలో నాగార్జున చేస్తున్నది నెగిటివ్ క్యారెక్టరే.. అది ఆయనే చెప్పారు కూడా. మరోవైపు కుబేరాలో గ్రే షేడ్స్ ఉన్న పాత్రలోనే కనిపించారు నాగ్. త్వరలోనే బ్రహ్మాస్త్ర 2తో పాటు మరో రెండు సినిమాలు చేయనున్నారు. ఇమ్మీడియట్‌గా మాత్రం 100వ సినిమాను మొదలుపెట్టబోతున్నారు నాగార్జున. మొత్తానికి ఒకప్పట్లా వేగంగా కాకుండా.. చాలా సెలెక్టివ్‌గా వెళ్లాలని ఫిక్సైపోయారు ఈ సీనియర్ హీరో. ఇమ్మీడియట్‌గా మాత్రం 100వ సినిమాను మొదలుపెట్టబోతున్నారు నాగార్జున. మొత్తానికి ఒకప్పట్లా వేగంగా కాకుండా.. చాలా సెలెక్టివ్‌గా వెళ్లాలని ఫిక్సైపోయారు ఈ సీనియర్ హీరో.

## 'కుబేర'కు భారీ ఓపెనింగ్స్: తొలిరోజే రూ.13 కోట్లు




మన గళం : విలక్షణ దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో స్టార్ హీరో ధనుష్, కింగ్ నాగార్జున, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం కుబేర. ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తోంది. అయితే ఈ చిత్రం విడుదలైన తొలిరోజే తెలుగు, తమిళ భాషల్లో కలిపి ఏకంగా రూ. 13 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో మొదటి రోజు థియేటర్లు 57.36 శాతం ఆక్యుపెన్సీతో నిండిపోయినట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. అయితే ఈ కలెక్షన్లు వీకెండ్‌లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. మరోవైపు తొలిరోజు వసూళ్లను బట్టి చూస్తే, ఇది ధనుష్ కెరీర్‌లో రెండో బిగ్గెస్ట్ ఓపెనింగ్ కలెక్షన్ కావడం విశేషం. అంతకుముందు ధనుష్ నటించిన రాయన్ చిత్రం తొలిరోజే రూ. 15 కోట్ల వసూళ్లను రాబట్టింది.

# ఆమిర్ ఖాన్ 'సితారే జమీన్ పర్' ఫస్ట్ డే కలెక్షన్లు ఇవే.!




మన గళం బాలీవుడ్ నటుడు.. మిస్టర్ ఫర్ఫెక్ట్ ఆమిర్‌ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'సితారే జమీన్ పర్' . ఆర్ఎస్ ప్రసన్న దర్శకత్వం వహించిన ఈ సినిమాలో జెనీలియా కథానాయికగా నటించారు. ఆమిర్‌ఖాన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆమిర్‌ఖాన్, అపర్ణ పురోహిత్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. లాల్ సింగ్ చద్దా వంటి డిజాస్టర్ తర్వాత చాలా గ్యాప్ తీసుకుని ఆమిర్ ఈ సినిమా చేయడంతో మూవీపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ఈ సినిమా మొదటిరోజు కలెక్షన్లు ఆశించినంత అందుకోలేకపోయాయి. ఈ చిత్రం తొలిరోజు కలెక్షన్లు చూసుకుంటే సుమారు ? 11.70 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. దీంతో వచ్చే వీకెండ్‌లో అయిన ఈ కలెక్షన్లు దాటుతుందని చిత్రబృందం భావిస్తుంది. ఈ సినిమా కథ గురించి చెప్పాలంటే.. గుల్షన్ అరోరా అనే ఓ కోపిష్ఠి బాస్కెట్‌బాల్ అసిస్టెంట్ కోచ్ జీవితం చుట్టూ తిరుగుతుంది. తన సీనియర్ కోచ్‌తో గొడవపడి, కోపంతో అతడిపై దాడి చేస్తాడు. దీనికి శిక్షగా కోర్టు గుల్షన్‌కు జైలు శిక్ష విధించకుండా, మానసిక సవాళ్లు ఎదుర్కొంటున్న పది మంది యువకులకు మూడు నెలల పాటు బాస్కెట్‌బాల్ శిక్షణ ఇవ్వాలని ఆదేశిస్తుంది. మొదట ఈ పనిని చాలా అసహనంగా భావిస్తాడు గుల్షన్. కానీ నెమ్మదిగా ఆ పిల్లల ఉత్సాహం, వారి సహజసిద్ధమైన ప్రతిభ.. వారి స్వభావం చూసి మారుతాడు. తన వ్యక్తిగత జీవితంలోని వైవాహిక సమస్యలను, తన బాల్యంలో ఎదుర్కొన్న సమస్యలను అధిగమిస్తూనే, గుల్షన్ తన టీమ్‌ను జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎలా సిద్ధం చేశాడు అనేది ఈ సినిమా స్టోరీ.

# లీడ్స్ టెస్టు.. తొలి రోజు భారత్‌దే

- లీడ్స్ టెస్టులో తొలి రోజు భారత్ పూర్తి ఆధిపత్యం
- కెప్టెన్‌గా అరంగేట్రంలోనే శుభ్‌మన్ గిల్ అజేయ శతకం



మన గళం ఇంగ్లండ్ గడ్డపై జరుగుతున్న అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ తొలి టెస్టు మొదటి రోజే భారత యువ బ్యాటింగ్ సత్తా చాటింది. హెడింగ్లీ మైదానంలో కెప్టెన్‌గా తన తొలి టెస్టు ఆడుతున్న శుభ్‌మన్ గిల్ (127 నాటౌట్), యువ సంచలనం యశస్వి జైస్వాల్ (101) అద్భుత శతకాలతో చెలరేగగా, వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ (65 నాటౌట్) దూకుడైన అర్ధశతకంతో వారికి తోడయ్యాడు. దీంతో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా తొలి రోజు ఆట ముగిసే సమయానికి 85 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 359 పరుగుల భారీ స్కోరు సాధించింది. ముందుగా బ్యాటింగ్ ప్రారంభించిన భారత్‌కు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ శుభారంభం అందించారు. ముఖ్యంగా జైస్వాల్.. ఇంగ్లండ్ పేసర్లపై పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. ఆఫ్-సైడ్‌లో కళ్లు చెదిరే కట్ షాట్లు, డ్రైవ్‌లతో అలరించాడు. మరోవైపు రాహుల్ కూడా అద్భుతమైన కవర్ డ్రైవ్‌లతో ఆకట్టుకున్నాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 91 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, బ్రైడన్ కార్స్ బౌలింగ్‌లో అనవసరపు షాట్‌కు ప్రయత్నించి రాహుల్ (42) ఫస్ట్ స్లిప్‌లో క్యాచ్ ఇచ్చి తీవ్ర నిరాశతో వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన అరంగేట్ర ఆటగాడు సాయి సుదర్శన్ (0) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. బెన్ స్టోక్స్ బౌలింగ్‌లో డకౌట్‌గా వెనుదిరిగాడు. దీంతో భారత్ లంచ్ విరామానికి రెండు కీలక వికెట్లు కోల్పోయి కాస్త ఇబ్బందుల్లో పడినట్లు కనిపించింది. అయితే, లంచ్ విరామం తర్వాత కెప్టెన్ గిల్, యశస్వి జైస్వాల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ ఇంగ్లండ్ బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా పూర్తి ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేశారు. ముఖ్యంగా బంతి పాతబడటం ఇంగ్లండ్ బౌలర్ల దాడిలో పదును తగ్గడం వీరికి కలిసొచ్చింది. గిల్ చూడచక్కని డ్రైవ్‌లు, ఫ్లిక్‌లతో పరుగులు రాబట్టగా, జైస్వాల్ తనదైన శైలిలో ఫ్రంట్-ఫుట్ డ్రైవ్‌లు, బ్యాక్-ఫుట్ కట్‌లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ క్రమంలో జైస్వాల్ 157 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఇది అతనికి ఇంగ్లండ్ గడ్డపై తొలి టెస్టు సెంచరీ కాగా, మొత్తంగా ఐదోది. సెంచరీ అనంతరం దూకుడు పెంచిన జైస్వాల్‌ను టీ విరామం తర్వాత బెన్ స్టోక్స్ అద్భుతమైన బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. గిల్-జైస్వాల్ జోడీ మూడో వికెట్‌కు 129 పరుగుల విలువైన భాగస్వామ్యం అందించింది. జైస్వాల్ నిష్క్రమణ అనంతరం క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్, తనదైన దూకుడైన ఆటతీరుతో ఇంగ్లండ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మరోవైపు నిలకడగా ఆడుతున్న గిల్, కెప్టెన్‌గా తన తొలి టెస్టులోనే శతకం పూర్తి చేసుకుని చరిత్ర సృష్టించాడు. 175 బంతుల్లో 127 పరుగులు చేసిన గిల్, ఈ ఘనత సాధించిన ఐదో భారత కెప్టెన్‌గా నిలిచాడు. విరాట్ కోహ్లీ తర్వాత ఈ జాబితాలో చేరిన ఆటగాడు గిల్ కావడం విశేషం. పంత్ కూడా 102 బంతుల్లో 65 పరుగులు చేసి అజేయంగా నిలవడమే కాకుండా, టెస్టుల్లో 3000 పరుగుల మైలురాయిని కూడా అందుకున్నాడు. గిల్, పంత్ జోడి అజేయంగా నాలుగో వికెట్‌కు 32.3 ఓవర్లలో 138 పరుగులు జోడించి, తొలి రోజే మ్యాచ్‌పై భారత్‌కు పూర్తి పట్టు లభించేలా చేసింది. ఇంగ్లండ్ బౌలర్లు రోజంతా భారత బ్యాటర్లను అడ్డుకోవడంలో విఫలమయ్యారు. కెప్టెన్ బెన్ స్టోక్స్ రెండు వికెట్లు పడగొట్టగా, బ్రైడన్ కార్స్ ఒక వికెట్ దక్కించుకున్నాడు. మిగతా బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. మొత్తం మీద తొలి రోజు ఆట పూర్తిగా భారత బ్యాటర్ల ఆధిపత్యంతో ముగిసింది.

## తొలి టెస్ట్‌లో సత్తా చాటిన గిల్




మన గళం ఇంగ్లండ్‌తో కఠిన పరిస్థితుల్లో ఎలా రాణిస్తారో అనే అనుమానాల మధ్య తొలి టెస్ట్ ఆడిన టీమిండియా కుర్రాళ్లు అదరగొట్టారు. ఇంగ్లండ్‌తో శుక్రవారం మొదలైన తొలి టెస్ట్ తొలి రోజు సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించారు. కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లోనే శుభ్‌మన్ గిల్ అదరగొట్టాడు. అద్భుత శతకం సాధించి జట్టును ముందుండి నడిపించాడు. ఈ నేపథ్యంలో పలు కీలక రికార్డులను కూడా తన పేరిట లిఖించుకున్నాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్ తొలి రోజు శుభ్‌మన్ గిల్ అజేయంగా సెంచరీ చేశాడు. 127 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. గిల్ టెస్ట్ కెరీర్‌లో ఇది ఆరో సెంచరీ. అయితే ఆసియా వెలుపల గిల్ సెంచరీ చేయడం ఇదే మొదటి సారి. కెప్టెన్‌గా తొలి టెస్ట్‌లోనే సెంచరీ చేసిన అతి పిన్న వయస్కుడైన భారత కెప్టెన్‌గా గిల్ నిలిచాడు. గిల్ కేవలం 25 సంవత్సరాల 285 రోజుల వయసులో కెప్టెన్‌గా గిల్ సెంచరీ చేశాడు. ఈ క్రమంలో గిల్.. విరాట్ కోహ్లీ (26 సంవత్సరాలు, 34 రోజులు) రికార్డును బద్దలు కొట్టాడు. అలాగే విదేశాల్లో టెస్ట్ సెంచరీ చేసిన మూడో అతి పిన్న వయస్కుడైన భారత కెప్టెన్‌గా గిల్ నిలిచాడు. గిల్ కంటే ముందు సచిన్ టెండూల్కర్ (23 సంవత్సరాల 253 రోజులు), కపిల్ దేవ్ (24 సంవత్సరాల 64 రోజులు) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. అలాగే గిల్ తాజా ఇన్నింగ్స్‌తో 2000 టెస్ట్ పరుగులను కూడా పూర్తి చేసుకున్నాడు.



## యశస్వి జైస్వాల్ సూపర్ ఇన్నింగ్స్



మన గళం ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి మ్యాచ్‌లో టీమిండియా బ్యాటర్లు అదరగొట్టారు. ముఖ్యంగా ఓపెనర్ యశస్వి జైస్వాల్ అద్భుత సెంచరీతో కదం తొక్కాడు. ఈ క్రమంలో పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఏకంగా ఆస్ట్రేలియా దిగ్గజం డాన్ బ్రాడ్‌మెన్ రికార్డును కూడా బద్దలుగొట్టాడు. ఇంగ్లండ్‌తో జైస్వాల్ ఇప్పటివరకు 10 ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఆ పది ఇన్నింగ్స్‌ల్లో 90.33 సగటుతో 813 పరుగులు చేశాడు. ఇంగ్లండ్‌పై బ్రాడ్‌మన్ సగటు 89.78 మాత్రమే. ఇది మాత్రమే కాదు.. ఈ ఇన్నింగ్స్‌తో మరికొన్ని రికార్డులను కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లలో ఆడిన తొలి టెస్ట్ మ్యాచ్‌లోనే సెంచరీలు కొట్టిన తొలి విదేశీ ఆటగాడిగా జైస్వాల్ నిలిచాడు. అలాగే హెడింగ్లీలో సెంచరీ చేసిన తొలి భారత ఓపెనర్‌గా నిలిచాడు. ఇక, ఇంగ్లండ్‌లో ఆడిన తొలి టెస్ట్ మ్యాచ్‌లోనే సెంచరీ చేసిన ఐదో టీమిండియా బ్యాటర్‌గా కూడా జైస్వాల్ నిలిచాడు. జైస్వాల్ కంటే ముందు మురళీ విజయ్, విజయ్ మంజ్రేకర్, సౌరవ్ గంగూలీ, సందీప్ పాటిల్ ఇంగ్లండ్‌లో ఆడిన తొలి టెస్ట్ మ్యాచ్‌ల్లో సెంచరీలు చేశ్శారు. అలాగే హెడింగ్లీలో తొలి వికెట్‌కు అత్యధిక పరుగులు జోడించిన టీమిండియా ఓపెనింగ్ జోడీగా కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ నిలిచారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 91 పరుగులు జోడించి అంతకు ముందు సునీల్ గవాస్కర్, కృష్ణమాచారి శ్రీకాంత్ (64) రికార్డును అధిగమించారు. ఈ మ్యాచ్‌లో జైస్వాల్‌తో పాటు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (127 నాటౌట్) కూడా అజేయంగా సెంచరీ సాధించాడు.

# ఆసియా ఆర్చరీ కప్ స్టేజ్-2లో.... భారత్‌కు తొమ్మిది పతకాలు



మన గళం భారత్‌కు తొమ్మిది పతకాలు ఆసియా ఆర్చరీ కప్ స్టేజ్-2లో భారత్‌కు తొమ్మిది పతకాలు దక్కాయి. వేర్వేరు టీమ్‌విభాగాల్లో ఐదు జట్లు ఫైనల్ పోరుకు అర్హత సాధించినా అన్నింట్లో భారత్ రెండో స్థానంలో నిలిచి రజత పతకాలతో సరిపెట్టుకుంది. ఆసియా ఆర్చరీ కప్ స్టేజ్-2లో భారత్‌కు తొమ్మిది పతకాలు దక్కాయి. వేర్వేరు టీమ్‌విభాగాల్లో ఐదు జట్లు ఫైనల్ పోరుకు అర్హత సాధించినా అన్నింట్లో భారత్ రెండో స్థానంలో నిలిచి రజత పతకాలతో సరిపెట్టుకుంది. టోర్నీలో మొత్తంగా భారత ఆర్చర్లు రెండు స్వర్ణాలు సహా, ఆరు రజతాలు, ఒక కాంస్యం ఖాతాలో వేసుకున్నారు. భారత ఆర్చర్లు తమ కంటే తక్కువ సీడ్ ప్లేయర్ల చేతిలో ఓటమిపాలై రజత పతకాలకు పరిమితమయ్యారు. పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో విష్ణుచౌదరి, పారాస్ హుడా, జుయెల్ సర్కార్‌తో కూడిన భారత త్రయం 0-6తో జపాన్ చేతిలో ఓడింది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో చౌదరీ, వైష్ణవి పవార్ జోడీ 32-35తో ఇండోనేషియాపై ఓడి రజతంతో సంతృప్తిపడింది. మరోవైపు పురుషుల కాంపౌండ్ ఫైనల్లో కుశాల్‌దలాల్ 149-143తో జోషు వా మనాన్ (ఆస్ట్రేలియా) పై గెలిచి పసిడితో మెరిశాడు. మహిళల విభాగంలో తేజల్ సాల్వే 146-144తో భారత్‌కే చెందిన షణ్ముకినాగ సాయిపై గెలిచి స్వర్ణం సొంతం చేసుకుంది.

## రసవత్తరంగా గాలె టెస్టు

మన గళం శ్రీలంక, బంగ్లాదేశ్ మధ్య గాలె వేదికగా జరుగుతున్న తొలి టెస్టు రసవత్తరంగా సాగుతున్నది. తొలి ఇన్నింగ్స్‌లో లంకేయులు.. 485 పరుగులకు ఆలౌట్ కాగా పర్యాటక బంగ్లాకు 10 పరుగుల స్వల్ప ఆధిక్యం దక్కింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లా.. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. షద్మన్ ఇస్లాం (76) అర్ధ శతకంతో మెరవగా తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరోలు కెప్టెన్ నజ్ముల్ (56బి), ముష్ఫికర్ (22బి) క్రీజులో ఉన్నారు.



Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310